
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
7
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
సోమవారం 28 అక్టోబరు 2024





కళా.. సాగు భళా !

పొలంలో దిగి గోంగూరను పరిశీలిస్తున్న ఆమె వ్యవసాయ శాస్త్రవేత్త అనుకుంటే మీరు తప్పులో కాలేసినట్లే. ఆమె ఎవరంటారా... ఓ మహిళా రైతు. పేరు కళావతి. ఊరు కావలి మండలం కొత్తపల్లి. డిగ్రీ పూర్తి చేసిన ఆమె ప్రకృతి వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నారు. ఎకరా పొలం కౌలుకు తీసుకుని, వరి, కాయగూరలు, ఆకుకూరలు పండిస్తూ రైతులందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

వివరాలు 8లో



సోమశిల

నిండుకుండలా..

- పుష్కలంగా నీటితో జలాశయాలు కళకళ
- సోమశిలలో 65, కండలేరులో 42 టీఎంసీలు
- ఇంకా కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- మొదటిపంట 8.50 లక్షల ఎకరాల్లో సాగుకు అవకాశం
- రెండో పంటకూ ఢోకా ఉండదని అంచనా
- రైతుల మోముల్లో ఆనందం

ఎన్నడూ లేనంతగా ప్రస్తుతం ధాన్యానికి మంచి ధర వచ్చింది. గతంలో పుట్టి రూ.15 వేలు పలకగా, నేడు రూ.22 వేలకు తక్కువ పలకడం లేదు. కానీ ఏం లాభం.. జిల్లాలోని రైతులకు మాత్రం గడిచిన రెండు సీజన్లలోనూ ఈ ధర అందలేదు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా గత రబీ సీజన్‌లో సగం ఆయకట్టు కూడా సాగు కాలేదు. ఇక రెండో పంట సంగతి సరేసరి. దీంతో ఈ ఏడాది కూడా మా పరిస్థితి ఇంతేనా..? అంటూ దిగాలుగా ఉన్న రైతాంగానికి కూటమి ప్రభుత్వ చర్యలతో మంచి రోజులువచ్చాయి. రానున్న రబీ సీజన్ ప్రారంభానికి ముందే సోమశిల, కండలేరు జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. ఈ రెండు జలాశయాల సామర్థ్యం 146 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 107 టీఎంసీలు వీటిల్లో నిల్వ ఉంది. మొదటి పంట ఉమ్మడి నెల్లూరుతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 8.50 లక్షల ఎకరాలకు నీరందించేందుకు వీలు కలిగింది. ఇంకా ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో వచ్చే ఏడాది రెండో పంటకు కూడా రైతులకు చింత ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

-నెల్లూరు, ఆంధ్రజ్యోతి

గత జూలై 31న నాటికి సోమశిల, కండలేరులలో నీటి నిల్వలు అడుగంటాయి. సోమశిలలో 9 టీఎంసీలు, కండలేరులో 6 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నాయి. దీంతో తాగునీటికి కూడా ఇబ్బందులు తప్పవన్న ఆందోళన వ్యక్తమైంది. అయితే కృష్ణా పరివాహకంలో వర్షాలు కురవడం, శ్రీశైలం జలాశ యంలో 860 అడుగుల మట్టం దాటడంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తీసుకొచ్చి, ఆ దామాషా నీటిని రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు వినియోగించాలని భావించింది. ఆ క్రమంలోనే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా సోమశిలకు నీటి విడుదల ప్రారంభించింది. తొలుత ఐదు వేల క్యూసెక్కులను విడుదల చేసిన ప్రభుత్వం, ఆ తర్వాత క్రమేణా పెంచుకుంటూ వచ్చింది. ఆ తర్వాత కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ నిండిపోవడంతో పూర్తి సామర్థ్యం నీటిని విడుదల చేయడం ప్రారంభించింది. ఒక దశలో కృష్ణా జలాల రాక రోజుకు 20 వేల క్యూసెక్కులకు చేరింది. అదే సమయంలో పెన్నా క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురవడం కూడా జిల్లాకు కలిసొచ్చింది. ఆ వర్షపు నీరు వాగులు, వంకల ద్వారా పెన్నాకు చేరి సోమశిలలో ఆగింది. ఆదివారం సాయంత్రానికి సోమశిలలో నీటి నిల్వ దాదాపు 65 టీఎంసీలకు చేరింది. అదే సమయంలో 21180 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమశిల పూర్తి నిల్వ సామర్థ్యం 78 టీఎంసీలు. అంటే మరో పది టీఎంసీల వరకూ నిల్వ చేసుకునేందుకు అవకాశముంది. ప్రస్తుతమున్న ఇన్‌ఫ్లో మరికొన్ని రోజులు వచ్చే అవకాశాలున్నట్లు ఇరిగేషన్ అధికారులు భావిస్తున్నారు. దీంతో జిల్లాలో వర్షాకాలం ముందే సోమశిల పూర్తిగా నిండిపోనుంది. కాగా కృష్ణా జలాలు వస్తుండడంతో కండలేరుకు కూడా నీటిని విడుదల మొదలు పెట్టారు. తొలుత 2 వేల క్యూసెక్కులు విడుదల చేసిన అధికారులు ఆ తర్వాత దానిని ఆరు వేలకు, ఇప్పుడు రెగ్యులర్‌గా పది వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి కండలేరు నిల్వ 42 టీఎంసీలకు పెరిగింది. కండలేరు పూర్తి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా

(మిగతా 8లో)



కండలేరు డ్యాం

త్వరలో విమానాశ్రయం పనులు

- నెల్లూరు నగరంలోని రైస్ మిల్లులను తరలిస్తాం
- వైసీపీ ధర్నాలు విడ్డూరం
- మున్సిపల్ మంత్రి నారాయణ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 27: నెల్లూరుకి విమానాశ్రయం ఎంతో అవసరమని, త్వరలో విమానాశ్రయ ం పనులు ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో ఆదివారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్‌తో సమీక్ష నిర్వహించారు. అనంతరం నారాయణ విలేకరులతో మాట్లాడుతూ ఎంతోకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న రెండు ముఖ్యమైన అంశాలను చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నెల్లూరుకి విమానమార్గం ఎంతో అవసరం ఉందన్నారు. ఎందుకంటే కృష్ణపట్నం పోర్టు, ఇంకా ఇతర పోర్టులు జిల్లాలో ఉన్నాయని తెలిపారు. వాటిలో కార్గో అనేది చాలా ముఖ్యమన్నారు. 2014-19 మధ్య టీడీపీ



సమీక్ష సమావేశంలో మంత్రులు నారాయణ, ఆనం, ఎమ్మెల్యేలు, కలెక్టర్

ప్రభుత్వంలో విమానాశ్రయాన్ని మంజూరు చేశామన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం నెల్లూరులో కాదు మరో దగ్గర విమానాశ్రయం అని పనులను ఆపేశారన్నారు. ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు నెల్లూరుకు వచ్చినప్పుడు దగదర్తిలోనే విమానాశ్రయం పెడతామని చెప్పారన్నారు. ఈ విషయమై కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుని కలిశామన్నారు. స్థలం సిద్ధం చేసుకోవాలని, తాను కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తానని ఆయన చెప్పారన్నారు. ఇందుకోసం వచ్చే వారం ఓ బృందాన్ని పంపిస్తారన్నారు. వీలైనంత త్వరలోనే విమానాశ్రయం పనులు ప్రారంభిస్తామని నారాయణ వివరించారు.

● రైలుమిల్లులను తరలిస్తాం.

రైసుమిల్లులు ఎక్కువగా కార్పొరేషన్ ప్రాంతంలో ఉన్నాయని చెప్పారు. అవి ఉన్న ప్రాంతంలో పొల్యూషన్ ఉండాల్సిన దానికన్నా, నాలుగురెట్లు ఎక్కువగా ఉందన్నారు. ఎన్జీటీ నిబంధనల ప్రకారం రైసు మిల్లులను ఇతర ప్రాంతాలకు తరలించాల్సి ఉందన్నారు. రైసు మిల్లుల యజమానులకు ఎలాంటి నష్టం లేకుండా, వారితో చర్చించి కృష్ణపట్నం పోర్టు, కిసాన్‌సెజ్ తదితర ప్రాంతాలకు వాటిని తరలిస్తామని నారాయణ తెలిపారు.

● ధర్నాలు చేయడం విడ్డూరం

కూటమి ప్రభుత్వంలో ఇసుక ధరలు తగ్గుతుంటే వైసీపీ వాళ్లు ధర్నాలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర దేవదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు నగరం చుట్టూ ఉన్న రైసుమిల్లులను ఇతర ప్రాంతాలకు తరలించాలని భావిస్తున్నామన్నారు. ఒకప్పుడు నగరశివారులో ఉన్న ఈ మిల్లులు నగరం విస్తరించటంతో నడిబొడ్డుకు చేరాయన్నారు. రైసుమిల్లుల అసోసియేషన్ వారితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.



రాళ్లపాడులో పూడికతీత

కందుకూరు నియోజకవర్గంలోని రాళ్లపాడు ప్రాజెక్టుకు సంబంధించి పూడికతీత పనులు జోరుగా సాగుతున్నాయి. కుడి, ఎడమ కాలువల్లో ఎంతో కాలం గా పేరుకుపోయిన పూడికను యంత్రాల సాయంతో తొలగిస్తున్నారు.

8 లో..

బోటు నిర్వాహకుల చేతివాటం

- ట్రాక్టర్‌కు రూ. 600 నుంచి రూ.1000 వరకు వసూలు
- ఆవేదనలో ఇసుక లోడింగ్ కూలీలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- అపహాస్యమవుతున్న ఉచిత ఇసుక పాలసీ

సంగం, అక్టోబరు 27: పెన్నానదిలో డీసిల్టేషింగ్ అనుమతులు పొందిన బోట్ల నిర్వాహకులు తీసిన ఇసుకను డంపింగ్ కేంద్రానికి తరలించకుండా, నేరుగా ట్రాక్టర్లకు విక్రయించి చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. అంతేకాక పెన్నానదిలో ఉచిత ఇసుక లోడింగ్ చేసే కూలీలకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ తతంగం గత నాలుగు రోజులుగా జరుగుతున్నా ఇటు రెవెన్యూ అధికారులుగానీ, అటు మైనింగ్ అధికారులుగానీ పత్తాలేకపోవడం గమనార్హం.

సంగం పెన్నానదిలో డీసిల్టేషన్‌తో ఇసుక తీసేందుకు మత్స్య సహకార సంఘాల బోట్లకు అనుమతించారు. ఇందుకుగాను టన్ను ఇసుకకు ప్రభుత్వం రూ. 150 చెల్లిస్తుంది. తీసిన ఇసుకను ప్రభుత్వం గుర్తించిన డంపింగ్ యార్డ్‌లకు తరలించాలి. అక్కడ నుంచి ఇసుకను బుకింగ్ చేసుకున్న టిప్పర్లు, లారీలకు టన్ను రూ. 350లకు విక్రయిస్తారు.



ట్రాక్టర్ డ్రైవర్ల వద్ద నగదు తీసుకుంటున్న బోటు ఏజెంటు

బోట్లతో ఇసుక తీయడం, డంపింగ్ యార్డ్‌కు తరలించడాన్ని స్థానిక రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుంది. అయితే మైనింగ్ అధికారుల మాయాజాలం వల్ల ట్రాక్టర్లకు బుకింగ్ లభ్యం కాకపోవడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. నదుల్లోకి వెళ్లి కేవలం ఎడ్లబండ్లకు మాత్రమే అనుమతి ఉంది. ట్రాక్టర్లకు అనుమతి లేదు. దీంతో ఇసుక కష్టాలు ఏర్పడ్డా యి. డిమాండ్‌ను బట్టి ట్రాక్టర్ ఇసుక వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగానే రూ.3000 లు పలు కుతోంది. దీన్ని గమనించి న ప్రభుత్వం ఉచిత ఇసు క అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు అనుమతించింది.

● ట్రాక్టర్లకు అనుమతి ఇవ్వడంతో..

ట్రాక్టర్లకు బుకింగ్ దొరకకపోవడంతో ఇసుక కొరత ఏర్పడింది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. దీంతో వారం కిందట స్థానిక అవసరాలకు నదులు, వాగులు, వంకల్లో ట్రాక్టర్లతో ఇసుక తీసుకోవచ్చునని ప్రభుత్వం తెలిపింది. దీంతో ట్రాక్టర్లు నేరుగా పెన్నానదిలో కూలీలతో లోడు చేసుకుని తెచ్చుకునే అవకాశం కలిగింది. దీని వల్ల ఇసుక రేట్లు తగ్గడంతోపాటు ఉచిత ఇసుక పాలసీ నెరవేరినట్లయింది.

● నేరుగా విక్రయాలు

నదుల్లో ఇసుకను తీసుకెళ్లేందుకు ట్రాక్టర్లకు అనుమతివ్వడంతో బోటు నిర్వాహకులు ఇసుకను డంపింగ్ యార్డ్‌కు తరలించకుండా నేరుగా ట్రాక్టర్లకు విక్రయిస్తున్నారు. చిన్న ట్రాక్టర్‌కైతే రూ.500లు, పెద్ద ట్రాక్టర్‌కైతే రూ.1000 తీసుకుని లోడ్ చేస్తున్నారు. ఇందువల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడడంతోపాటు కూలీలకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బోటు నిర్వాహకులు నేరుగా ట్రాక్టర్లకు ఇసుక విక్రయించకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కందుకూరులో బెల్ట్ తీశారు !

8లో..

గ్రామ గ్రామాన గొలుసు దుకాణాలు

అధిక ధరలకు మద్యం విక్రయాలు

నెల్లూరు అయ్యప్పగుడి సెంటర్‌లో హత్యకు గురైన ముక్తియార్(ఫైల్)



- వరుస హత్యలతో వణుకుతున్న నెల్లూరు నగరం
- కత్తులతో యువత హల్‌చల్

పేట్రేగుతున్న హింస

- హద్దు మీరుతున్న రౌడీషీటర్ల అరాచకాలు
- పోలీసులను ఖాతరు చేయని నేరస్థులు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరు నగరం కొంత కాలంగా రక్తసిక్తమయింది. వరుస హత్యలు, దొంగతనాలు, వేధింపులు, దాడులు, దోపిడీలు జరుగుతుండడంతో నగర ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతున్నది. ఈ సంఘటనల్లో రౌడీషీటర్ల ప్రమేయం అధికంగా ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా కొంతమంది యువకులు కత్తులు జేబుల్లో పెట్టుకొని తిరగడం అలవాటుగా మారింది. వీరికి పోలీసులంటే లెక్కేలేకుండా పోయింది. అంతేకాక ఏదైనా నేర సంఘటన జరిగితే అందులో రాజకీయ నేతలు జోక్యం చేసుకోవడంతో నేరగాళ్లకు కలిసొస్తున్నది.

● కత్తులతో హల్‌చల్

తాజాగా నెల్లూరు నగరంలో ఎక్కువమంది యువత కత్తులు చేత పట్టుకొని తిరిగే స్థాయికి వచ్చారు. రౌడీషీటర్లు, పాత నేరగాళ్ల ఆయుధాలను తీసుకెళ్లడం చూస్తుంటాం. అయితే విద్యార్థులు, యువత సైతం కత్తుల్ని ఉంచుకోవడం తిరగడం ఇటీవల కనిపిస్తోంది. పాత నేరస్థులు ఇగోలకు వెళ్లి వారినివారే దారుణంగా హత్య చేసుకుంటున్నారు. ఇలాంటి ఘటనలు వరుసగా వెలుగు చూస్తున్నాయి.

● బర్త్‌డే వేడుకల్లో కొత్త సంస్కృతి

పుట్టినరోజు వేడుకలంటే ఓ ఫంక్షన్ హాల్ బుక్ చేసుకొని , బంధువులు, స్నేహితుల మధ్య ప్రశాంతంగా చేసుకోవడం ఆనవాయితీ. అయితే ప్రస్తుతం ఇలాంటి వేడుకలంటే ఆయా సెంటర్లలో ప్రత్యేక స్టేజీలు ఏర్పాటు చేసి, వీధులకు బ్లాక్ చేయడం, లైటింగ్, పెద్ద ఎత్తున ఫెక్సీలు, భారీ కేకును పెద్ద పెద్ద కత్తులతో కట్ చేయడం అలవాటుగా మారింది. అంతేకాక ఈ వేడుకలకు వచ్చేవారిలో అత్యధికులు నగరంలోని రౌడీషీటర్లు, పాత నేరస్థులే ఉంటున్నారు. ఇలా వేడుకలు ఏమిటని నగర వాసులు ప్రశ్నిస్తే వారిపై దాడికి యత్నిస్తున్నారు. అర్ధరాత్రి వరకు జరిగే ఈ వేడుకలను ఆయాస్టేషన్ల పరిధిలోని బీట్‌కానిస్టేబుల్ అడ్డుకునే ప్రయత్నం చేస్తుంటే.. మేము అధికార పార్టీకి సంబంధించిన వాళ్లం...నీస్థాయి ఏంటి... ? నిన్ను ఈ స్టేషన్‌లోనే లేకుండా చేస్తాం...మీ ఇన్‌స్పెక్టర్‌కి మేము ఎంత చెబితే అంత...అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో ఆ కానిస్టేబుళ్ల చేసేది లేక కేకు తిని వెళ్లిపోతున్నారు.



కూరగాయల మార్కెట్‌లో హత్యకు గురైన వాకా అశోక్(ఫైల్)

ఈ ఘటనలు పరిశీలిస్తే..

● అందరూ చూస్తుండగానే ఆటో మెకానిక్ దారుణ హత్యకు గురైన ఘటన అయ్యప్పగుడి వద్ద ఈనెల 24న రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు, నెల్లూరు రూరల్ ఇందిరమ్మకాలనీకి చెందిన షేక్ ముక్తియార్ (38) అలియాస్ మోటు, ముజహిద్ దంపతులు. వారికి నయాబ్ రసూల్, పర్వీన్‌లు సంతానం. కుమారుడు విజయవాడలో డిప్లమో, కుమార్తె నగరంలో ఏడో తరగతి చదువుతోంది. ముక్తియార్ అయ్యప్పగుడి వద్ద పఠాన్‌బాబుకి చెందిన ఆటో మెకానిక్‌షెడ్‌లో పని చేస్తున్నాడు. ఖాళీ సమయంలో ఆటో నడుపుతుండేవాడు. ఇటీవల యజమాని అతడ్ని పని నుంచి తొలగించాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. ఆటోను సైతం కుదువ పెట్టాడు. మూడు రోజులుగా పూటుగా మద్యం సేవించి తనను తిరిగి పనిలోకి తీసుకోవాలని యజమానిని అడగసాగాడు. ఈ క్రమంలో ఈనెల 24న సాయంత్రం ముక్తియార్ షెడ్ వద్దకు వెళ్లి యజమానితో గొడవ పడ్డారు. మాటామాటా పెరిగి కోపోద్రిక్తుడైన బాబు ఇనుప రాడ్డుతో తలపై మోదడంతో ముక్తియార్ అక్కడిక్కడే మృతి చెందాడు.

● నగరంలోని మద్రాస్ బస్టాండు ప్రాంతంలో ఈనెల 14న అర్థరాత్రి రౌడీషీటర్ వాకా అశోక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి హతమార్చారు. పోలీసుల సమాచారం మేరకు, అశోక్ టిఫిన్ చేస్తుండగా ఇద్దరు యువకులు అతడి వద్దకు వచ్చి 'ఏరా... ఇంకా మారవా' అంటూ ప్రశ్నించారు. దీంతో అతను మీకెందుకురా.. అని ప్రశ్నించగా, ఓ యువకుడు తన వద్ద ఉన్న కత్తితో బలంగా అశోక్‌ను పొడిచారు. అక్కడున్న వారు వారించడంతో ఇద్దరు యువకులు పరారయ్యారు. ఈ ఘటనలో అశోక్ మృతి చెందాడు.

● నగరంలోని రాంజీనగర్ మూడో వీధిలో అనూసింగ్ నివాసం ఉంటున్నాడు. ఆయన స్నేహితులతో కలిసి ఈనెల 8న రాత్రి ట్రంకురోడ్డు నుంచి రాధామాధవ్ థియేటర్ల సందు వైపు వెళుతుండగా ఓ బాలుడు వేగంగా వచ్చి వారి బైక్‌ను ఢీకొన్నాడు. అంత వేగంగా వెళ్లడం ఎందుకు.. అని ఆ బాలుడిని వారు ప్రశ్నించారు. దీంతో ఆ బాలుడు కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేసి

(మిగతా 8వ పేజీలో)



ఆకుపై దుర్గమ్మ



బుల్లి ప్రెజర్‌కుక్కర్



పొగతో గణపతి

శంకరుడి దృష్టి సూక్ష్మ శిల్ప సృష్టి

ప్రతి వస్తువుపై కళాఖండాలు

- 'గంధవళ్ల' వృత్తి ఉపాధ్యాయుడు ప్రవృత్తి ప్రకృతి ఆరాధన
- ఎన్నో పురస్కారాలు.. ప్రశంసలు

ఆయన వృత్తి ఉపాధ్యాయుడు. ప్రవృత్తి వివిధ కళారూపాలు సృష్టించడం. నెల్లూరు నగరంలోని సుంకు చెంగన్న మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గంధవళ్ల ఉమాశంకర్ ఊహ తెలిసిన నాటి నుంచే కాగితాలతో గ్రీటింగ్‌లు, అట్టముక్కలతో చిన్నచిన్న నమూనాలు తీర్చి దిద్దేవారు. వెదురు బద్దలతో పెళ్లిళ్లకు బహుమతులు తయారు చేసేవారు. బంకమట్టితో బొమ్మలు తయారు చేసేవారు. అలా మొదలైన ఆయన కళాత్మక దృష్టి ఎన్నో వినూత్న ప్రయోగాలు చేసేందుకు



సాధించిన రికార్డులు

- ఇండియన్ బుక్ రికార్డు
- ఆర్‌హెచ్‌ఆర్ వరల్డ్ రికార్డు
- తమిళనాడు స్టేట్ రికార్డు
- బెస్ట్ ఆర్టిస్టు, బెస్ట్ టీచర్ అవార్డు
- లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు
- యూనిక్ వరల్డ్ రికార్డు
- వండర్ రికార్డు
- తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్
- స్టేట్ బుక్ ఆఫ్ రికార్డు
- ఎవరెస్ట్ బుక్ ఆఫ్ రికార్డ్
- మిరాకిల్ వరల్డ్ రికార్డు

విద్యార్థిగా చదువుల్లో రాణించడమేకాక ఆటపాటలు, నాటకాల్లోనూ చురుగ్గా పాల్గొనేవారు. ఎన్నో కొత్త విషయాలు, అధునాతన ఆలోచనలతో తనలోని కళను రంగరించి, వినూత్న ప్రయోగాలు చేసేవారు. ఇలా జిల్లా, రాష్ట్ర స్థాయిలో తన ప్రతిభను చాటుకున్నారు. ఆకులతో ప్రముఖుల చిత్రాలు, ప్రముఖ దినోత్సవాలకు విద్యార్థులకు బోధనకు ఉపయోగించే అక్షరాలు, తదితరాలను తయారు చేశారు. వాటిని సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించి అందరి మన్ననలు పొందేవారు. విద్యార్థులకు ఆకులతో చిత్రాల తయారీలో శిక్షణ ఇచ్చారు. బోన్సాయ్ మొక్కలు కూడా పెంచేవారు. తన ఇంటిని కూడా బోన్సాయ్ మొక్కలతో నందనవనంగా తీర్చిదిద్దారు. తనవంతుగా సైన్స్‌ఫెయిర్‌కు అనుకూలమైన నమూనాలు రూపొందించి ప్రదర్శించారు. తన వాక్‌చాతుర్యంతో విద్యార్థులకు చక్కని బోధనను అందిస్తూ వారి అభిమాన గురువుగా రాణిస్తున్నారు.

- నెల్లూరు సాంస్కృతికం, (ఆంధ్రజ్యోతి)



చంద్రబాబుకు జ్ఞాపిక అందజేస్తూ సెల్ఫీ (ఫైల్)

● ఎన్నో రూపాలకు ప్రాణం

గంధవళ్ల ఉమాశంకర్ తన నైపుణ్యంతో ఎన్నో కళారూపాలకు ప్రాణం పోశారు. పొగ చిత్రాలు, సీసాలోపల చిత్రాలు, పెన్సిల్ మొనలపై అద్భుత చిత్రాలు, చాక్‌పీసులపై కళాఖండాలు ఆయన ప్రతిభకు తార్కాణాలు. పెన్సిల్‌ను దీపపు స్తంభంగా రూపొందించి వెలిగించారు. అలాగే చాక్‌పీస్‌తో అద్భుత దీపస్తంభం తయారు చేశారు. నెల్లూరు. నగరానికి విచ్చేసిన వివిధ రంగాల ప్రముఖులకు తన కళాఖండాలను బహుమతిగా అందజేసి ఆశీస్సులు, ప్రశంసలు పొందారు. ఆయన కళాతృష్ణ, కళారూపాలు ఎందరో కళాకారులకు స్ఫూర్తినిచ్చి ప్రోత్సహిస్తున్నాయి. ఇలా ప్రతిభను కనబరచడం వెనుక తన సతీమణి ప్రసన్న సహాయ సహకారం ఎంతో ఉందని చెబుతారు ఉమాశంకర్.

కళా.. సాగు భళా!

రైతులంటేనే నేడు చిన్నచూపు... అలాంటిది ఓ మహిళా రైతు అంటే పరిస్థితి ఇంకా దారుణం. కానీ ఏళ్ల తరబడి వ్యవసాయం చేస్తున్న రైతులతో పోటీగా రసాయనిక ఎరువులకు దూరంగా వ్యవసాయం సాగిస్తోంది ఆమె. అంతేనా.. సాగు చేసేది ఎకరా పొలమే. అదికూడా కౌలుకు తీసుకుని.. ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు కావలి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బుసిరెడ్డి కళావతి.



తన చేలో పూసిన పూలు కోస్తున్న కళావతి

- ప్రకృతి వ్యవసాయంలో కళావతి నైపుణ్యం ● ఎకరం భూమిలో ఎన్నో పంటలు
- ప్రధానంగా వరిసాగు ● గట్లపై కూరగాయలు, ఆకుకూరల పెంపకం
- ఖర్చులు తగ్గించి, ఆదాయం పొందుతూ సేద్యం ● ఆదర్శ మహిళా రైతుగా ప్రశంసలు

పంటలో సాగులో పెట్టుబడులు తగ్గించడం... ప్రకృతి ప్రసాదించిన వనరులతో ఎరువులను తయారు చేసుకుని ఆరోగ్యకరమైన పంటను, మంచి దిగుబడులు సాధిం చడం.. ప్రకృతి వ్యవసాయం ప్రధాన ఉద్దేశం. ఈ క్రమంలో దుక్కులు దగ్గర నుంచి పంటల ఎంపిక, సాగు నుంచి పంట చేతికందే వరకు ప్రకృతి అందిస్తున్న వాటిని ఎరువులుగా వాడుతూ దిగుబడులు పెంచుతూ ముందుకు సాగుతున్నారు మహిళా రైతు



పంటకు అవసరమైన ఎరువులు తయారు చేస్తూ..

బుసిరెడ్డి కళావతి. డిగ్రీ చదువుకున్న ఆమెకు సాధారణ వ్యవసాయంలో అనుభ వం ఉన్నా ప్రకృతి వ్యవసాయ విధానంలో మాత్రం ఎనిమిదేళ్ల అనుభం ఉంది. ఆ అనుభవంతోనే ఎకరా పొలం కౌలుకు తీసుకుని ఏ గ్రేడ్ వరి రకమైన కెఎన్ ఎం-1638ను పండించారు. అంతేకాక ఆకుకూరలు, కూరగాయల మొక్కలు పెంచి ఆదాయం పొందుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

● అధికారుల సూచనలు పాటిస్తూ..

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై వ్యవసాయ అధికారులు, సిబ్బంది ద్వారా అవగాహన పెంచుకుంది ఆమె. వారి సూచనలు పాటిస్తూ రసాయనిక ఎరువులకు బదులుగా బీజామృతం, జీవామృతం, నిమాస్త్రం వంటి వాటిని వినియోగిస్తూ అధిక దిగుబడులు సాధించి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఆమె అనుసరిస్తున్న పద్ధతుల ను చుట్టుపక్కల రైతులు వచ్చి తెలుసుకుని వారు కూడా అవలంభిస్తున్నారు. అంతే కాక గట్లపై ఆకుకూరలు, దోస, బీర అలసంద, బెండ, మొక్కజొన్న, బంతిపూలతోపా టు పశువులకు అవసరమైన మేతను సాగుచేస్తున్నారు కళావతి.

● వచ్చిన ఆదాయం రూ.80,692

కళావతి కౌలుకు తీసుకున్న ఎకరా పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటల ద్వారా ఖర్చులు పోను రూ.80,692ల మేర ఆదాయం లభించింది. పెట్టుబడి విషయానికి వస్తే విత్తనాలు, దుక్కి, కూలీల ఖర్చుతోపాటు కౌలు ఖర్చులు సుమారుగా రూ.19840లు. పొలం గట్లపై వేసిన ఆకుకూరలు, దోస, బీర, అలసంద, పశువుల మేతకు సంబంధిం చిన విత్తనాలకు పెట్టుబడి రూ.2500లు. అలాగే గోంగూర, బంతి, బెండ, అలసంద, మొక్కజొన్న సాగుకు అవసర మైన విత్తనాల ఖర్చు రూ.1360లు. మొత్తం మీద రూ.23700లు ఖర్చులు. ఆయా పంటల ద్వారా వచ్చిన ఆదాయం రూ.1,04,392లు. ఖర్చులు పోగా వచ్చిన ఆదాయం నికరంగా రూ.80692లు. ఇది ఒక పంటకాలంలో కళావతి సాధించిన ప్రగతి.

- నెల్లూరు వ్యవసాయం, (ఆంధ్రజ్యోతి)

ఖర్చులు తగ్గించుకుంటేనే ఆదాయం

పంటల సాగులో అదనపు ఖర్చులు తగ్గించడమే ప్రకృతి వ్యవసాయ ప్రధాన ఉద్దేశం. ప్రకృతిలో లభించే వాటిని వినియోగించుకోవడం వల్ల రసాయనిక ఎరువులను దూరం పెట్టవచ్చు. దిగుబడులు ఆశించినంత వస్తాయి. కళావతి సాగు చేసిన పంటలను నెలలో రెండు సార్లు తప్పనిసరిగా పరిశీలించి, అవసరమైన సలహాలు ఇచ్చాం.



- మాలకొండయ్య, డీపీఎం, ఏపీసీఎన్‌ఎఫ్

ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించా..

ఎకరా కౌలుకు తీసుకుని ఏగ్రేడ్ వరి సాగుచేశా. విత్తనశుద్ధి, దుక్కి, దున్నడం దగ్గర నుంచి పంట కోత దశకు వచ్చే వరకు కేవలం ఆవు మూత్రం, పేడ ద్వారా తయారుచేసుకున్న ఎరువులనే పంటకు వినియోగించా. వరినారు శుద్ధికి బీజామృతం, ప్రధాన పొలంలో నాటిన పైరుకు ఘనజీవామృతం, నిమాస్త్రం వంటివి పంటకు అందించడంతో ఖర్చులు బాగా తగ్గాయి. అంతేకాక అధిక దిగుబడిని సాధించా. పంటల సాగులో ఏపీ కమ్యునిటీబేస్డ్ నేచురల్ ఫార్మింగ్(ఏపీసీఎన్‌ఎఫ్) డీపీఎం మాలకొండయ్య, ఏడీపీఎం మునిరత్నం, డీపీపీ కరిమున్నీసా సూచనలతోపాటు మా అత్త రాజమ్మ ఎంతో సహాయం చేశారు.



- బుసిరెడ్డి కళావతి

పేట్రేగుతున్న హింస

(7వ పేజీ తరువాయి)

వారితో వచ్చి లీలామహల్ సెంటర్ వద్ద నుంచి వెళుతున్న అనూసింగ్, స్నేహితులపై రాళ్లతో విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ ఘటనలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనను చూసిన ప్రజలు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు.

● సీసీఎస్ పోలీసుస్టేషన్ సమీపంలో రౌడీషీటర్ ప్రణయ్‌పై సెప్టెంబరు 29న అర్ధరాత్రి పలువురు యువకులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. నెల్లూరు బోడిగాడితోటకు చెందిన ఆర్ అర్మగం భార్య రైల్లో యాచిస్తూ జీవిస్తోంది. అదే ప్రాంతానికి చెందిన ఆకాష్ భార్య కూడా యాచన చేసేది. ఈ క్రమంలో వారిద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ వివాదంలో ఆర్మగంపై ఆకాష్ చేయి చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 29న అర్ధరాత్రి ఆర్మగం తన స్నేహితుడయిన తడికల బజారుకు చెందిన రౌడీషీటర్ ప్రణయ్‌తో సీసీఎస్ పోలీసుస్టేషన్ సమీపంలో మాట్లాడుతుండగా, ఆటోలో ఆకాష్‌తో పలువురు అక్కడకు చేరుకొని రాళ్లతో దాడి చేశారు. ఈ క్రమంలో ప్రణయ్‌పై కత్తితో దాడి చేశారు.

● అలాగే నగరంలోని మద్రాస్ బస్టాండు సెంటరు సమీపంలో ఇటీవల మామని అల్లుడు కత్తితో దారుణంగా పొడిచి హత్య చేశాడు.

● గత ఏడాది రామలింగాపురం సెంటర్‌లో జరిగిన రౌడీ షీటర్ హత్యను ఆ ప్రాంత ప్రజలు ఇప్పటికీ మరచిపోలేదు. ఇలా చెప్పుకుంటూపోతే ఇటీవల జరుగుతున్న వరుస హత్యలు, దోపిడీలు, దొంగతనాలు నెల్లూరు నగర ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు ఈ హింసాత్మక సంఘటనలపై దృష్టి సారించి, శాంతిభద్రతలు కాపాడాలని నగర ప్రజలు కోరుతున్నారు.

నగరంలో పోలీసుల స్పెషల్ డ్రైవ్

నెల్లూరు(క్రైం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఆదివారం రాత్రి పోలీసు అధికారులు నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని, లైసెన్సులు లేని వాహనదారులపై జరిమానాలు విధించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. రికార్డులు సరిగా లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. రికార్డులు సరిగా లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

వెంకటాచలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెముడుగుంట సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళానికి చెందిన కృష్ణ (47) కొంత కాలంగా చెముడుగుంట సమీపంలో రహదారికి కూతవేటు దూరంలో ఉన్న రైస్ మిల్లులో కాపురం ఉంటూ పనిచేసుకొని తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే పని నిమిత్తం బుజబుజనెల్లూరుకు వెళ్లి తిరిగి ఆటోలో వచ్చి దిగి తాను పనిచేస్తున్న రైస్ మిల్లుకు వెళ్లేందుకు రహదారి దాటుతుండగా గూడూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో కృష్ణ అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఆంజనేయులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి మృతుడి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు పక్కన పడి ఉన్న కృష్ణ మృతదేహం

శరవేగంగా పూడికతీత

● రాళ్లపాడు కుడి, ఎడమ కాలువల్లో పనులు

లింగసముద్రం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు రిజర్వాయరు కుడి, ఎడమ కాలువల్లో పూడికతీత పనులు శరవేగంగా సాగుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఈ ప్రాజెక్టు కింద వరిసాగు లేక, కాలువలు పూడిక, పిచ్చిచెట్లతో నిండిపోయాయి. నాలుగేళ్ల తర్వాత రాళ్లపాడు ఆయకట్టు రైతులు ఈ ఏడాది వరిసాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ తరుణంలో కుడి, ఎడమ కాలువల్లో పూడికతీతకు ప్రాజెక్టు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఎడమ కాలువ పూడికతీత పూర్తవగా, కుడికాలువ పూడికతీత పనులు 40 శాతం మేర పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. మూడునాలుగు రోజుల్లో పనులు పూర్తిచేసి వరి నారుమళ్ల కోసం నీటిని విడుదల చేస్తామన్నారు.



రాళ్లపాడు కుడికాలువలో పూడిక తీస్తున్న ఎక్స్‌కవేటర్

నిండుకుండలా జలాశయాలు

(7వ పేజీ తరువాయి)

ఇక్కడ మరో 20 టీఎంసీలు నిల్వ చేసుకునేందుకు అవకాశముంది. ఈ ప్రాజెక్టు కూడా జిల్లాలో వర్షాలు కురిసే సమయానికి నిండు కుండలా మారిపోతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తంగా చూసుకుంటే ఆగస్టు ఒకటి నుంచి ఇప్పటి వరకూ 92 టీఎంసీలకు పైగా నీరు సోమశిల, కండలేరు జలాశయాల్లోకి చేరడం గమనార్హం.

● రైతుల్లో ఆనందం

సీజన్‌కు ప్రారంభంలోనే సోమశిల, కండలేరు జలాశయాలు నిండిపోవడంతో ఉమ్మడి నెల్లూరు జిల్లా రైతాంగం మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. గత రెండు సీజన్లఫ సరిగా సాగు చేసుకోలేక రైతాంగం నానా అవస్థలు పడింది. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో గతేడాది రెండో పంట సమయంలో నీటి దుర్వినియో గం జరిగిన మూలంగా గత రబీ సీజన్‌లో పూర్తి ఆయకట్టులో సాగు జరగలేదు. కేవలం మూడు లక్షల ఎకరాలకు మాత్రమే నీరు అందించగలిగారు. ఇక ఈ ఏడాది రెండో పంట అయితే అసలు సాగు జరగలేదు. ధాన్యానికి మంచి ధర ఉన్న సమయం లో ఇటువంటి పరిస్థితులు తలెత్తడం రైతాంగాన్ని కుంగదీసింది. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం ముందు చూపుతో రబీ సీజన్ లో పూర్తి ఆయకట్టు సాగు జరగనుంది. ప్రస్తుతం రెండు జలాశయాల్లో 107 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెడ్ స్టోరేజీ పది టీఎంసీలు, తాగునీటి అవసరాలు పోను 90 టీఎంసీలను సాగు కు ఉపయోగించుకోవచ్చు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఎనిమిది లక్షల ఎకరాలతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మరో 50 వేల ఎకరాలకు ఈ దఫా సాగునీరు ఇచ్చేందుకు వీలు కలుగుతుంది. అలాగే ఇంకా సోమశిలకు ఇన్‌ఫ్లో కొనసాగుతుండడం, జిల్లాలో నవంబరు, డిసెంబరు నెలల్లో వర్షాలు కురిసే అవకాశాలున్న నేపథ్యంలో వచ్చే ఏడాది రెండో పంటకు కూడా ఢోకా ఉండదని ఇరిగేషన్ ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు.

సోమశిలకు 22,368 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 22,368 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 64.350 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 50 క్యూసెక్కులు, కండలేరు డ్యాంకు 10,000, ఉత్తరకాలువకు 300 క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు.

కందుకూరులో బెల్ట్ తీశారు!

- గ్రామగ్రామాన బెల్ట్ షాపులు ● అధిక ధరకు మద్యం విక్రయం
- దుకాణాల్లోనే రూ.10 అదనం ● పట్టించుకోని ఎక్సైజ్

కందుకూరు, అక్టోబరు 27: నూతన మద్యం పాలసీతో మద్యం ప్రియులకు సరసమైన ధరలకే నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తేవాలన్న ప్రభుత్వ లక్ష్యానికి మద్యం షాపుల యజమానులు తూట్లు పొడుస్తున్నారు. షాపులకన్నా బెల్టే ముద్దు అన్న చందంగా గ్రామగ్రామాన బెల్ట్ దుకాణాలను ఏర్పాటుచేసి సరుకును అక్కడకు తరలించి అమ్ముకోవడానికే మక్కువ చూపుతున్నారు. ఎమ్మార్పీకన్నా అదనంగా అమ్మాలన్న మద్యం షాపుల యజమానుల ఆలోచనలకు ఎక్సైజ్ అధికారులు సహకరించడం లేదు. దీంతో వారు అధిక ధరల విక్రయాలకు బెల్ట్ దుకాణాలను రాజమార్గంగా ఎంచుకుంటున్నారు.

● గ్రామ గ్రామాన దుకాణాలు

నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చి పదిరోజులు కూడా కాకపోయినా గ్రామగ్రామాన బెల్ట్ దుకాణాలు వెలిశాయి. బెల్ట్ దుకాణాలలో క్వార్టర్ బాటిల్‌ను ఎమ్మార్పీకన్నా ఇరవై, ముప్పై రూపాయలు అదనంగా వసూలు చేస్తూ దర్జాగా విక్రయాలు చేస్తున్నారు. అయినా ఎక్సైజ్ అధికారు లు చోద్యం చూస్తున్నారు. ఒక మండల పరిధిలో వచ్చిన మద్యం దుకాణాన్ని ఆ మండలంలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చునన్న నిబంధన ఉండటంతో తొలుత షాపులు దక్కించుకున్నవారు పలుచోట్ల పోటాపోటీగా దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో మద్యం వ్యాపారుల మధ్య పోటీ నెలకొంది. ఎమ్మార్పీకే మద్యం దొరుకుతుందని మందుబాబులు ఆశించగా మద్యం విక్రయాలను ఆదాయ వనరుగా మార్చుకోవాలన్న లక్ష్యంతో వ్యాపారులు సర్దుబాటు చేసుకుని ఒక గ్రామంలో ఒకే దుకాణం ఉండేలా చూసుకోవటంతోపాటు బెల్ట్‌గ్రామాలను పంచుకుని పోటాపోటీగా అధిక ధరలకు అమ్మకాలు ప్రారంభించారు. ప్రతి గ్రామంలో రెండు,మూడు బెల్ట్ దుకాణాలు ఇప్పటికే ఏర్పాటు చేశారు. జనాభా అధికంగా ఉండే గ్రామాల్లో నాలుగైదు బెల్ట్‌షాపులు కూడా వెలవటం విశేషం. అధికార పార్టీ నాయకుల కనుసన్నలలోనే బెల్ట్‌షాపుల నిర్వాహకులు నిర్ధారణ జరగటంతో వారు ఇష్టారీతిగా అధిక ధరలకు అమ్మి సొమ్ముచేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



● అధిక ధరలకు విక్రయం

మద్యం షాపుల నిర్వాహకులే బెల్ట్‌షాపుల వారికి ఎమ్మార్పీకి ఇవ్వకుండా వారివద్ద క్వార్టర్‌కు రూ. 10 అదనంగా వసూలు చేస్తున్నారు. దీంతో వారు ఆ మద్యాన్ని గ్రామాలకు తీసుకెళ్లి రూ. 30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. మరోపక్క పట్టణంలోని కొన్ని మద్యం దుకాణాల వద్ద యథేచ్ఛగా అనధికార సిటింగ్‌లు ఏర్పాటుచేసి వాటర్, గ్లాసు పేరుతో వసూళ్లకు తెరలేపటం విశేషం. ఎక్సైజ్ అధికారులు తగినచర్యలు తీసుకుని ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వాగు కాదు.. రోడ్డే!



ఈ చిత్రంలో కనిపిస్తున్న లారీ ఇరుక్కున్నది వాగులోనో... వంకలోనో కాదు పొదలకూరు-సోమశిల రోడ్డులో.. శనివారం రాత్రి భారీ లోడ్‌తో సోమశిల వైపు వెళుతున్న ఈ లారీ వెంకటరెడ్డిపల్లి వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో దిగబడిపోయి ఆదివారం సాయంత్రం వరకు అలానే ఉంది. దీంతో రోడ్డుపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

- కలువాయి (ఆంధ్రజ్యోతి)

అబ్బా.. ఎన్ని సీతాకోక చిలుకలో!



ప్రకృతి రమణీయతకు ప్రతీకగా నిలిచే అటవీ అందాలకు తోడు సీతాకోక చిలుకలు కనువిందు చేస్తున్నాయి. ఉదయగిరి దుర్గం అటవీ ప్రాంతానికి వెళ్లే రహదారికి ఇరువైపులా సీతాకోకచిలుకల అందాలు చూస్తే ఎవరికైనా మనసు పులకరిస్తుంది. పచ్చని చెట్ల మధ్యలో వివిధ రంగులతో కనువిందు చేస్తున్నాయి. అటుగా వెళ్లే వాహనదారులు, పర్యాటకులు ఆ దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు.

- ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి)

పెన్నానదిలో పడి వ్యక్తి మృతి

కోవూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు పెన్నానదిలో పడి మృతి చెందాడు.ఈ ఘటన ఆదివారం జమ్మిపాలెం సమీపంలో చోటుచేసుకుంది. కోవూరు పోలీసులకు అందిన ఫిర్యాదు వివరాలిలా ఉన్నాయి. ఫర్నీచర్ దుకాణంలో పనిచేసే కొత్తూరు రోడ్డు రామాలయం వీధికి చెందిన చింతా రాంబాబు సెలవుదినం కావడంతో స్నేహితులు సుమన్, దుర్గాలతో కలిసి పెన్నానదిలో చేపల వేటకు వెళ్లాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు నదిలోపడి కొట్టుకుపోయాడు. ఎంతసేపటికీ రాకపోవడంతో స్నేహితులు పెన్నానదిలో పలుచోట్ల గాలించారు. చివరికి నదిలో తేలుతున్న మృతదేహాన్ని గుర్తించి భార్య చింత మారేటమ్మకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రంగనాథ్ గౌడ్ తెలిపారు.



రాంబాబు మృతదేహం

బైక్ బోల్తా పడి ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మోటర్ బైక్ బోల్తాపడి ఇద్దరు గాయపడిన సంఘటన మండలంలోని గొలగమూడి క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గూడూరు పట్టణానికి చెందిన ప్రసాద్‌రావు, క్రిష్ణమూర్తి పని నిమిత్తం బైక్‌పై నెల్లూరుకు వస్తుండగా గొలగమూడి క్రాస్ రోడ్డు సమీపానికి వచ్చేసరికి రాంగ్ రూటులో ఆటో ఎదురుగా రావడంతో అదుపుతప్పి బైక్ బోల్తాపడింది. ఈప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వానరాల పట్టివేత... గ్రామస్థుల హర్షం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సీతారామపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24వ తేదీన ప్రచురితమైన వానరాలతో వణుకే! కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఆదివారం సీతారామపురం గ్రామంలో కోతులను పట్టివేసే కార్యక్రమం చేపట్టారు. గత సంవత్సరం నుంచి కోతుల వల్ల గ్రామ ప్రజలు, చిరువ్యాపారస్తులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతులు పట్టివేసి అటవీ ప్రాంతంలో వదిలేయడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో రైలు నుంచి పడి ఇద్దరి మృతి

కోవూరు, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): పడుగుపాడు- కొడవలూరు రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం ఉదయం ట్రైన్‌లో నుంచి జారిపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపా రు. 28-30సంవత్సరాల మధ్య వయస్సున్న వ్యక్తి నెల్లూరు వైపు వెళ్తున్న ట్రైన్‌లో నుంచి జారిపడినట్లు భావిస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహం కావడంతో మార్చురీకి తరలించారు. మృతదేహంపై ఎడమ మోచేతికింద త్రిశూలం పచ్చబొట్టు గుర్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు నల్లని చొక్కా, నల్లని ప్యాంటు ధరించి ఉన్నట్లు వివరించారు.

కొడవలూరు అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నాయుడుపాలెంలో వద్ద నున్న రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి రైలు నుండి జారిపడి మృతి చెందినట్లు కావలి రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు 35ఏళ్ల వయసు ఉంటుందని పచ్చ చొక్కా , పసుపు డ్రాయర్ ధరించి ఉన్నాడని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొడవలూరు అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గండవరం ప్రభుత్వ పాఠశాలలో 1995-96 పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి గత అనుభవాలు నెమరు వేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఇంటర్ యూనివర్సిటీ క్రీడా పోటీలకు బీఈడీ విద్యార్థుల ఎంపిక

నెల్లూరు(విద్య), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీలకు నగరంలోని ప్రభుత్వ బీఈడీ కళాశాల విద్యార్థులు కె.యువరాజ్, పి.చిన్నబాబు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వేణుగోపాల్ ఒక ప్రక టనలో తెలిపారు. చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం యూని వర్శిటీలో ఈనెల 30 నుంచి జరిగే ఇంటర్ యూనివర్శిటీ కబడ్డీ పోటీలకు కె.యువరాజ్, బెంగళూరులోని క్రీస్ట్ యూనివర్శిటీలో నవంబరు 1 నుంచి జరగనున్న ఇంటర్ యూనివర్శిటీ బాస్కెట్‌బాల్ పోటీలకు పి.చిన్నబాబు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నుంచి ప్రాతి నిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. యూనివర్శిటీ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వీరిద్దరూ ఈ పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా కీర్తిని ఇనుమడింప చేయాలని తెలిపారు. వీరిని బీఈడీ కళాశాల పీడీ రవీంద్రబాబు, సిబ్బంది అభినందించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	134
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	266
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7519
వెండి కిలో ధర	రూ. 100,400
వెండి ఒక గ్రాము	రూ.103.40

గ్రామసభల

లక్ష్యం నెరవేరేనా?

- భూముల రీసర్వేలో తప్పుల సవరణకు ఏర్పాటు
- సర్వే నెంబర్లు మారి రిజిస్ట్రేషన్లకు అగచాట్లు
- వెబ్‌ల్యాండ్‌లో నెంబర్లు కూడా తేడానే...
- రైతులు రుణాలకు కోసం బ్యాంకులకు వెళ్తే తిరస్కరణ
- తహసీల్దార్, రిజిస్ట్రార్ కార్యాలయాలకు తిప్పుతున్న బ్యాంకర్లు



అల్లూరులో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

అల్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీసర్వే తమను ఇక్కట్ల పాలు చేసిందని జిల్లా రైతులు భావిస్తున్నారు. రీసర్వేతో తమ పేర్లు వెబ్‌ల్యాండ్‌లో నమోదువతాయని సంబరపడిపోయిన వారికి రీసర్వే తరువాత పలు సమస్యలు ఎదురయ్యాయి. తమ పరిధిలోని భూములకు రీసర్వేలో ఎల్‌పీఎం (ల్యాండ్ పార్శిల్ మ్యాప్) నెంబరును సృష్టించి, ఆ నెంబరు ద్వారా సంబంధిత భూయజమాని (ప్రస్తుత) పేరును నమోదు పరచాల్సింది పోయి ఇదివరకు ఎవరి పేర్లు నమోదై ఉన్నాయో వారి పేర్లను అలానే వదిలేసి ఎల్‌పీఎం నెంబరును ఏర్పాటు చేశారు. ఇది తీవ్ర సమస్యలకు దారితీసింది. రైతుల పేర్లతో వెబ్‌ల్యాండ్ రికార్డులో నమోదవ్వాల్సిన రికార్డు నమోదు కాకపోగా, కొన్ని చోట్ల ఇతరుల పేర్లు నమోదై సమస్యగా మారింది. వీటిని సవరించేందుకు రెవెన్యూశాఖ తాజాగా గ్రామసభలను నిర్వహిస్తున్నది.

● రుణం కోసం వెళ్తే తిరస్కరణ

అన్ని రికార్డులు సరిగ్గా ఉన్న భూములకు మాత్రమే రుణాలు ఇస్తామని బ్యాంకర్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తమ వద్ద ఉన్న రిజిస్ట్రేషన్ పత్రాలు, వెబ్‌ల్యాండ్ రికార్డు, పాత పట్టాదారు పాసుపుస్తకాలు, నూతన పాసుపుస్తకకాలను రైతులు తీసుకొని బ్యాంకులకు వెళ్తే ఈ రికార్డులన్నీ ప్రస్తుత వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో ఒకే సర్వేనెంబర్లు ఉంటేనే రుణాలు మంజూరు చేస్తామని బ్యాంకర్లు తెలుపుతున్నారు. దీంతో ఇవన్నీ తీసుకొని తహసీల్దారు కార్యాలయానికి వెళ్తే, ఆ విధంగా రావాలంటే సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో సవరణ పత్రాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచిస్తున్నారు. అక్కడి నుంచి సంబంధిత సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి వెళ్లగా ఆ విధంగా సవరణ చేయాలంటే పూర్తిగా (సవరణ రిజిస్ట్రేషన్‌కు అయ్యే ఫీజు కాకుండా) ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం పూర్తిగా స్టాంపు డ్యూటీ చెల్లిస్తే రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్తున్నారు. ఇలా చేయాలంటే ఎకరానికి విలువను బట్టి రూ.25 వేలు నుంచి రూ.35 వేలు వరకు, ఇంకా విలువ కలిగిన భూములకు రూ.లక్షల్లో స్టాంపు డ్యూటీ చెల్లించాల్సి వస్తున్నదని రైతులు పేర్కొంటున్నారు.

● గ్రామసభల్లో సమస్యలు తీరేనా ?

ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం తాజాగా గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నది. ఈ సభల్లో రైతులకు ఎదురయ్యే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తే. రైతుల పేర్లు మార్పుచేర్పులు చేపట్టి నూతన రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు ముద్రించి రైతులకు అందిస్తామని ప్రభుత్వం చెబుతున్నది.కాగా రిజిస్ట్రేషన్‌లో ఎదురయ్యే సమస్యలకు ఎవరు సమాధానం చెప్తారన్నదే ప్రశ్నగా మారింది. దీనికి పరిష్కారాన్ని చూపాలని జిల్లా అధికారులను రైతులు కోరుతున్నారు.

● రిజిస్ట్రేషన్‌కు అష్టకష్టాలు

ఇదివరకే రిజిస్ట్రేషన్ చేయించుకొని ఉన్న రైతులకు దస్తావేజుతోపాటు సదరు భూమికి సంబంధించిన వెబ్‌ల్యాండ్ రికార్డు, పట్టాదారు పాసుపుస్తకాలు.. రీసర్వేలో ఎల్‌పీఎం నెంబరు ఏర్పాటుతోపాటు వెబ్‌ల్యాండ్‌లో పూర్తిగా సర్వేనెంబర్లు మారాయి. ఇదివరకే పట్టాదారు పాసుపుస్తకంలో ఉన్న నెంబర్లు వేరుగా, కొత్తగా మంజూరు చేసిన పాసుపుస్తంలో నెంబర్లు వేరుగా వచ్చాయి. దీంతో తమ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు రైతు అష్టకష్టాలు పడుతున్నాడు. ఇలాంటి ఉదాహరణలు అల్లూరు మండలంలో అనేకం ఉన్నాయి. ముఖ్యంగా గోగులపల్లిలో అ ఇవే సమస్యలు కోకొల్లలు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 47 మండలాల్లోని పరిస్థితి ఇదే.



రైతులను ఆదుకోవాలి

రీసర్వేలో ఏర్పడిన సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్ పత్రాలకు, రీసర్వే నెంబర్లకు అసలు పొంతనే లేదు. ఒకరి భూముల సర్వేనెంబర్లు మరొకరికి వెళ్లిపోతున్నాయి. ఎల్‌పీ ఎం నెంబర్లు అంటూ లేనిపోని సమస్యలు తెచ్చిపెట్టి ఇప్పుడు గ్రామసభలు అంటున్నారు. ఈ గ్రామసభల్లోనైనా సమస్యలు పరిష్కరించి, రైతులకు ఆదుకోవాలి.

- ఆట తిరుమల, సర్పంచు, పడమర గోగులపల్లి,అల్లూరు మండలం



సమస్యలు లేకుండా సర్వే చేయాలి

జిల్లాలోని ప్రధాన గ్రామాల్లో రీసర్వే ఇంకా చేయలేదు. గ్రామసభల అనంతరం మిగిలిన గ్రామాల్లో కూడా రీసర్వే చేపడతారని అధికారులు అంటున్నారు. ఆ సమయంలోనైనా ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు లేకుండా చూడాలి. రైతు స్వతహాగా చేసుకునే సర్వే అయితే ఇప్పటికి ఎన్ని గొడవలు జరిగేవో అర్థం కావడం లేదు.

- యరటపల్లి శేఖర్‌రెడ్డి, రైతు, అల్లూరు

తీరంలో రక్షణ గోడ నిర్మాణం

● కావలి ఎమ్మెల్యే దగుమాటి ● కోతకు గురైన తాటిచెట్లపాలెం తీరప్రాంతం పరిశీలన

బిట్రగుంట, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని తీర ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం రూ.రెండు కోట్లను మంజూరు చేసిందని వాటితో కోతకు గురయ్యే ప్రాంతాల్లో ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం చేపడతామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం బోగోలు మండలం తాటిచెట్లపాలెంలో కోతకు గురైన తీరప్రాంతంను అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. సందర్శించారు. సముద్రం అలలతో ప్రతిఏటా తీరప్రాంతం కోత పెరుగుతుందని ఇదే విధంగా కొనసాగితే ప్రాణహానితో పాటు గ్రామ ఉండదని పెద్దకాపు నాగరాజు, చిన్నకాపు మోహన్‌రావులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ విషయపై ఇదివరకే కలెక్టర్లకు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతిననిధులకు విన్న మించుకున్నా ఎలాంటి ప్రయోజనం లేదని వాపో యారు. 25ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు ఉప్పు గాలికి దెబ్బతిని తరచూ తెగిపోతున్నా యని వాపోయారు. తీరప్రాంత గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. కిలోమీటరు వరకు నడచి కోతకు గురైతీరం ప్రాంతంను, పడిపోయిన తాటి చెట్లు, బంకింగ్ కెనాల్‌లను ఎమ్మెల్యే పరిశీలిం చారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రూ.40లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. అవసరమైతే మరిన్ని సీసీ రోడ్లకు నిధులు వచ్చే చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక గంగపుత్రులు జీవనోపాధికి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లకుండా 10 మంది కలసి రాయి తీపై బోటు కొనుగోలు చేసుకుని చేపల వేటకు వెళ్లాలన్నారు. మత్స్యకార అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకశ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో వంశీకృష్ణ, ఫిషరీస్ జేడీ నాగేశ్వరావు, మాజీ ఆప్కాప్ చైర్మన్ పాలిశెట్టి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, స్థానిక నేతలు నాగేశ్వరావు, ఆదిశేషయ్య మత్స్యకార నేతలు వాయిలబాబు, త్యాగరాజు, పార్థస్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

'ఉదయగిరిని జిల్లా చేసేందుకు సహకరించండి'

ఉదయగిరి రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనాదిగా ప్రభుత్వాల నిరాదరణకు గురై అభివృద్ధికి నోచుకోని ఉదయగిరిని జిల్లా కేంద్రంగా చేసేందుకు సహకరించాలని కోరుతూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్ సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల్లోని 21 మెట్ట మండలాలను కలిపి ఉదయగిరి కేంద్రంగా జిల్లాగా చేయాలని డిమాండ్ చేశారు. పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్, సోమశిల హైలెవల్ కెనాల్ పనులు దశాబ్దాలుగా కొనసాగుతుండడంతో తాగు, సాగునీరు లేక ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారన్నారు. పాలకులు, అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సభ్యులు షేక్‌ఎండీ ఖాజా, మురళి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ వేణుగోపాల్

ఇక స్మార్ట్ మీటర్లు !

- ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం
- తొలుత కేటగిరి 2 సర్వీసులకు ఏర్పాటు
- వ్యవసాయ కనెక్షన్లకు మినహాయింపు

నెల్లూరు,(జడ్పీ), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వాడకంపై ఇక నుంచి స్మార్ట్‌మీటర్లు వినియోగించనున్నారు. వాడకం తరువాత బిల్లుతో పనిలేకుండా ముందుగానే రీచార్జి చేసుకోవటం ద్వారా విద్యుత్‌ని వినియోగించుకోనేలా స్మార్ట్ మీటర్లను విద్యుత్ సంస్థ అందుబాటులోకి తెచ్చింది. తమ మీటర్లలో ఎంత విద్యుత్ అందుబాటులో ఉంది.. ఎంత వాడకం జరుగుతుంది... ఎప్పుడు విద్యుత్ అయిపోతుంది.. మళ్లీ ఎంత రీచార్జి చేసుకోవాలి.. తదితర పూర్తి సమాచారం వినియోగదారుల సెల్‌ఫోన్‌లో ఉండనుంది. సెల్‌ఫోన్‌లో మొబైల్ యాప్ ద్వారా స్మార్ట్ మీటర్‌ను అనుసంధానం చేసుకుని బిల్లుల చెల్లింపులతో సహ విద్యుత్ కొనుగోలు, వాడకం సర్వం ఫోన్‌లో పరిశీలించుకునే అవకాశం స్మార్ట్ మీటర్లు ద్వారా కలుగుంది. దీంతో అధునిక సౌకర్యాలు కలిగిన స్మార్ట్‌మీటర్లని జిల్లాలో ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభించారు. జిల్లాలో వ్యవసాయ మీటర్లు మినహా, అన్ని కేటగిరి సర్వీసులకు స్మార్ట్ మీటర్లు బిగించనున్నారు. అయితే తొలిగా ప్రభుత్వ కార్యాలయాలు, వీధిలైట్లు, కేటగిరి-2 సర్వీసులకు స్మార్ట్‌మీటర్లను బిగిస్తున్నారు. జిల్లాలో 1,36,805 కేటగిరిలో రెండు మీటర్లు ఉండగా వాటిలో నెల్లూరు సిటీతో సహ అన్ని ప్రాంతాలతో కలుపుకుని 3,700 మీటర్లు మాత్రమే ఏర్పాటు చేశారు. మిగతా మీటర్లకి స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియ కొనసాగుతుందని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు.



● ఉపయోగాలు ఎన్నో..

స్మార్ట్ మీటర్లు వినియోగదారులకు ప్రయోజనకరంగా ఉంటాయని విద్యుత్ శాఖ అధికారులు తెలుపుతున్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు కార్యాలయానికి వెళ్లి క్యూలో నిలుచుకునే ఇబ్బంది తొలగిపోతుందన్నారు. ఎస్పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే విద్యుత్ రీచార్జి చేసుకోవటం, ఎంత నివియోగం అవుతుందో తెలుసుకోవటం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని వారు పేర్కొన్నారు. విద్యుత్ రీచార్జి అయిపోయ్యే ముందుగానే ఫోన్‌కు సమాచారం వస్తుందని, దీంతో రీచార్జి చేసుకోనే అవకాశం ఉంటుందని, మీటర్ల రీడింగ్‌లో తప్పులు దొర్లకుండా ఉంటుందని వారు తెలిపారు. వీటితోపాటు 11,13కెవీ ఫీడర్ల కు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నందున అయా ప్రాంతాలకు ఎంత సరఫరా అవుతుంది, ఎంత వృథా అవుతుంది,ఎంత విద్యుత్ చౌర్యానికి గురవుతుందని సమాచారమంతా తెలిసి పోతుందన్నారు.

● జిల్లాలో సర్వీసుల వివరాలు

జిల్లాలో సర్వీస్ వివరాలు ఇలా ఉన్నాయి. కేటగిరి 1 కింద 12,11,841 సర్వీసులు, కేటగిరి2లో 1,36,805 సర్వీసులు, కేటగిరి 3 సర్వీసులు 8,787, కేటగిరి4లో 31,011 సర్వీసులు, వ్యవసాయానికి 2,52,481 సర్వీసులు ఉన్నాయి. వీటిలో వ్యవసాయ సర్వీసులు మినహా మిగిలిన అన్ని కేటగిరిలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు.

స్మార్ట్ మీటర్ల ప్రక్రియ కొనసాగుతోంది

జిల్లాలో వ్యవసాయ కనెక్షన్లు మినహాయించి, అన్ని కేటగిరిలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తాం. తొలివిడతగా కేటగిరి 2 సర్వీసులకు బిగిస్తున్నాం. వినియోగదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి మిగతా సర్వీసులకు ఏర్పాటు చేస్తాం.

- విద్యుత్ ఎస్‌ఈ విజయన్

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పాకశాలలకు శంకుస్థాపన

బిట్రగుంట, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జేపీగూడూరు పంచాయతీలోని సోమేశ్వరపురం కామాక్షితాయి సోమేశ్వరసామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం పాకశాల శంకుస్థాపనకు భూమిపూజ చేశారు. ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణ చార్యులు శాస్త్రోక్తంగా ఈ పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో రాధాకృష్ణ మాట్లాడారు. దేవాదాయ శాఖ నిధులు రూ.10లక్షల వ్యయంతో ఈ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, యర్రం వేంకటేశ్వర్లురెడ్డి, పుట్టా సుబ్బారావు, కోటారెడ్డి, మాల్యాద్రి, అర్చకులు సూర్యప్రకాష్ ఉన్నారు.

భగవద్గీత ప్రచారం

వింజమూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దీపావళి జ్ఞాన జ్యోతి వెలుగులు ప్రతి ఇంట్లో వెలగాలి అనే ఉద్దేశ్యంతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక దుత్తలూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక దుత్తలూరు అధ్యక్షుడు, సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటా ధర్మ ప్రచారం

ప్రకృతి వ్యాలీ వ్యవస్థాపకుడు దాట్లరాయి జగపతిరాజు సమూహం ఆధ్వర్యంలో ఇంటింటా ధర్మ ప్రచార కార్యక్రమం ఆదివారం జరిగింది. వింజమూరులోని ఎర్రబెల్లిపాలెం గ్రామం, బొమ్మరాజుచెరువు గ్రామంలోని ఇంటింటికి తిరిగి శాకాహారంపై ప్రచారం చేశారు.

రూ.లక్షలు వెచ్చించి.. మూలకు చేర్చి..

● వైద్యుడు లేక నిరుపయోగంగా ఫిజియోథెరపీ పరికరాలు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఫిజియోథెరపీ వైద్యుడి పోస్టు గతేడాదిగా ఖాళీగా ఉండడంతో రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన పరికరాలు నిరుపయోగంగా మారాయి. గతంలో ఇక్కడ పనిచేస్తున్న వైద్యుడిని అధికారులు ఇతర ప్రాంతానికి బదిలీ చేశారు. అప్పటి నుంచి ఇక్కడ వైద్యుని నియామకం జరగలేదు. జిల్లా కేంద్రానికి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉదయగిరి ప్రాంతంలో ఫిజియోథెరపీ సేవలు ఎంతగానో అవసరం. ప్రస్తుతం వైద్యుడు లేకపోవడంతో పలువురు రోగులు స్థానికంగా, ఇతర ప్రాంతాల్లో ఉండే ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వ్యయప్రయాసాలతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో పలు విభాగాలకు సంబంధించి వైద్యుల నియామకం చేపట్టకపోవడంతో రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన పరికరాలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వైద్యులను నియమించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.


వైద్యశాలలో నిరుపయోగంగా ఉన్న ఫిజియోథెరపీ పరికరాలు

ఆత్మరక్షణకు కరాటే ఆయుధం: ఎమ్మెల్యే దగుమాటి

కావలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తనను తాను రక్షించుకోవటానికి కరాటే ఒక ఆయుధంగా పనిచేస్తుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక పట్టాభిరామ కల్యాణ మండపంలో కరాటే చాంపియన్‌షిప్ పోటీలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. టీడీపీ నేతలు కండ్లగుంట మధుబాబు నాయుడు, గుంటుపల్లి, రాజకుమార్ చౌదరి, తటవర్తి రమేష్, తిరువీది ప్రసాద్ పాల్గొన్నారు.

అంకమ్మ విగ్రహ ప్రతిష్ఠ

మండలంలోని చలంచర్ల పంచాయతీ పెద్దవరం గిరిజన కాలనీలో ఆదివారం జరిగిన అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.


జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బాధితురాలికి న్యాయం చేయాలి


వైద్యశాలలో బాధితురాలిని పరామర్శిస్తున్న దళిత నేతలు

ఆత్మకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అనంతసాగరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని మోసం చేసి ఆత్మహత్యా యత్నానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ సీమాంధ్ర అధ్యక్షుడు పందిరి సుబ్బయ్య, కులవివక్ష పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య కోరారు. ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితురాలిని ఆదివారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితురాలికి న్యాయం జరగకపోతే పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు, హ్యూమన్‌రైట్స్ జిల్లా నాయకులు దిపోగు బాబు, వాదాల కోటేశ్వరి, పి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూముల పరిశీలన

ఉదయగిరి రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడేపల్లి, కృష్ణంపల్లి రెవెన్యూ పరిధిలో ఆక్రమణకు గురైన సీజేఎఫ్ఎస్, గండిపాళెం జలాశయం ముంపు భూములను తహసీల్దారు సుభద్ర ఆదేశాల మేరకు వీఆర్వో బిల్లుపాటి వెంకటేశ్వర్లు, సచివాలయ సర్వేయరు రామకృష్ణలు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా భూములను చదును చేసిన వారితో చర్చించారు. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు యత్నించినా, చదును చేసి పంటలు సాగు చేసేందుకు ప్రయత్నించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హెచ్‌ఎంల సంఘం డివిజన్ సమావేశం

కావలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం డివిజన్ సమావేశం ఆదివారం పట్టణ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. సమావేశంలో కేంద్రం విద్యార్థులకు ప్రవేశపెట్టిన అపార్ ఐడీ నంబరు క్రియేషన్‌లో ఎదురయ్యే ఇబ్బందులపై చర్చించారు. అలాగే నవంబరులో జరిగే జిల్లా అసోసియేషన్ సమావేశం గురించి చర్చించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి సీహెచ్.చలపతి, జిల్లా కౌన్సిలర్ ఆర్.మురళీధర్, డివిజన్ అధ్యక్షుడు చాగంటి మురళీ, కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా పరీక్షల కార్యదర్శి శ్రీరామకుమార్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కొండారెడ్డి పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

అనంతసాగరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి, ఉద్యోగాల కోసం సోమవారం అనంతసాగరంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరుగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో యువత పేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దారు సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 11న ఆత్మకూరు నియోజకవర్గానికి సంబంధించి జాబ్‌మేళ జరుగుతుందని, 10వ తరగతి, ఇంటర్, పాలిటెక్నిక్, ఏదైన డిగ్రీ, పీజీ చేసిన నిరుద్యోగులకు ప్రయివేట్ సెక్టార్‌లో ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు : డీఎం

ఆత్మకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో పంచారామ క్షేత్రాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, సామర్లకోట, ద్రాక్షారామం దర్శించుకునేందుకు భక్తుల సౌకర్యార్థం ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ షేక్ కరీమున్నీసా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 3, 10, 17, 24 తేదీల్లో రాత్రి 8 గంటలకు ఆత్మకూరు డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరుతాయని, ఒక్కొక్కరికి రానుపోను టికెట్ ధర రూ. 2700గా నిర్ణయించామన్నారు. అరుణాచలం దర్శించుకునే భక్తుల కోసం సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతామని తెలిపారు. ఒక్కొక్కరికి రానుపోను టికెట్ ధర రూ.1400గా నిర్ణయించామన్నారు. వాటికి ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఆత్మకూరు డిపో మేనేజర్ లేదా అసిస్టెంట్ మేనేజర్లను 9959225645, 7382924753 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

●కందుకూరు: కార్తీకమాసంలో కందుకూరు డిపో నుంచి అరుణాచలం గిరిప్రదక్షిణకు, పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రతిశనివారం రాత్రి ఇక్కడి నుంచి బస్సు బయలుదేరుతుందని, అలాగే కార్తీక పౌర్ణమి సందర్భంగా పంచారామ క్షేత్రాలైన అన్నవరం, కుండలేశ్వరం యాత్రకు నవంబరు 14న ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శబరిమల యాత్రకోసం కిలోమీటరుకు రూ.57 చొప్పున అద్దె ప్రాతిపదికన బస్సులు ఏర్పాటు చేస్తామని పూర్తి వివరాల కోసం సెల్:73828 89870, 83285 86114 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

వృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ

కావలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విశ్వోదయ సంస్థల వ్యవస్థాపకుడు దొడ్ల రామచంద్రారెడ్డి (డీఆర్) మానవతావాదని ప్రముఖ వైద్యులు అల్లం శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం సంస్థ సేవా సమితి కార్యాలయంలో 60 మంది పేద వృద్ధులకు ఆయన నగదు, బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేశారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడారు. డీఆర్ విద్యాప్రదాత అని ఆయన సమాజానికి చేసిన సేవలు మరువలేనివి అన్నారు. డీఆర్ మార్గంలోనే ఆయన తనయులు వినయకుమార్ రెడ్డి, విద్యాధర్‌రెడ్డిలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, సేవాసమితి సభ్యులు రామకృష్ణ, సతీష్‌సింగ్, రంగనాయకులు, బాష పాల్గొన్నారు.


వృద్ధురాలికి నగదు అందజేస్తున్న అల్లం శ్రీనివాసులు

మందకృష్ణ మాదిగ పర్యటనను జయప్రదం చేయండి

● ఎమ్మెస్పీ జాతీయ నేత గొల్లపల్లి

కావలి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నవంబరు 3న చేపట్టనున్న జిల్లా పర్యటనను జయప్రదం చేయాలని ఎమ్మెస్పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ కోరారు. ఆదివారం అరుంధతివాడలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు అక్కిలగుంట ఏసు అధ్యక్షతన సంఘం సభ్యులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్‌కృష్ణ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్, వెంకటేశ్వర్లు, వేగూర వెంకటేశ్వర్లు, గేరా జానకి, పెంచులయ్య పాల్గొన్నారు.

ఆత్మీయసభను జయప్రదం చేయండి

●కందుకూరు: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ నవంబరు 3న ఒంగోలులో నిర్వహిస్తున్న ఆత్మీయసభను జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు వర్ల దేవదాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మీయ సభకు ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ నాయకులు, కార్య కర్తలంతా పెద్దసంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ వర్గీకరణ వద్దు.. ఐక్యతే ముద్దు

● బిట్రగుంట: ఎస్సీ వర్గీకరణ వద్దు అందరు ఐక్యమత్యంగా ఉండటం ముద్దని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు తెలిపారు. బోగోలు మండలం చెన్నారాయినపాలెం పంచాయతీ మాలపల్లెలో ఆదివారం సాయంత్రం వర్గీకరణకు వ్యతిరేకంగా స్థానికులను చైతన్య పరుస్తూ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబరు నాలుగో తేదీన వర్గీకరణ వెతిరేకిస్తూ అల్లూరులో మాలల మహాగర్జన చేపడుతునట్లు తెలిపారు.

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

గుడ్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రాంగణంలో ఆదివారం యూటీఎఫ్ మండలశాఖ స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జివి చలపతి శర్మ పాల్గొన్నారు. సంఘం వ్యవస్థాపకులు దాచూరి రామిరెడ్డి, మక్కెన కోటయ్యలు చేసిన పోరాటలను నెమరు వేసుకున్నారు. అనంతరం సంఘం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా శ్రీనివాసులురెడ్డి, అధ్యక్షుడిగా మనోహరం, ప్రధాన కార్యదర్శిగా మక్కెన రమేష్‌బాబు, సహాయకార్యదర్శులుగా మాల్యాద్రి, ఎస్. ప్రసన్నకుమారి, కోశాధికారిగా ఆర్ సుధాకర్‌లు ఉన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాల్యాద్రి, యు. జ్యోతికుమారి, వెంకటేశ్వర్లు, మధుసూదన్, ఎం.తిరుపతి స్వామి, పొన్నగంటి వెంకటేశ్వర్లు ఉన్నారు.

నేడు రక్తదాన శిబిరం

కందుకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్‌హాలులో సోమవారం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ వి.సాంబశివయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

అనంతసాగరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవూరులో ఆదివారం సాయంత్రం జరిగిన ఘర్షణలో ఇద్దరు గాయపడ్డారు. ఎస్సీ కాలనీకి చెందిన ఆత్మకూరు వెంకటేశ్వర్లు, చీకుర్తి పెంచల ప్రసాద్ కుటుంబాలకు గత కొంత కాలంగా విభేదాలు ఉన్నాయి. ఈక్రమంలో ఇరువురికి మాట మాట పెరిగి గొడవకు దిగారు. ఈక్రమంలో వెంకటేశ్వర్లు కర్రతో పెంచలయ్య, అతని భార్య పుష్పలతపై కర్రతో దాడి చేయగా ఇద్దరూ గాయపడ్డారు. వారిని బంధువులు ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. అయితే ఇందులో దాడికి పాల్పడిన వెంకటేశ్వర్లు వైసీపీ చెందిన వాడు కాగా, గాయపడిన వారు టీడీపీ అనుచరులు కావడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అనంతసాగరం పోలీసులు తెలిపారు.

ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

ఉలవపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేసేందుకు అర్హులని సెలైన్లు, ఇంజక్షన్లు వేయరాదని కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా వైద్యాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రంలోని ఆర్ఎంపీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రోగులకు స్టెరాయిడ్స్ ఇచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే చట్టరీత్యా శిక్షార్హులని హెచ్చరించారు. తనిఖీలలో తన దృష్టికి వచ్చిన అంశాలను జిల్లా ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా నివేదిక అందజేస్తామన్నారు.

నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఆర్ వెంకటేశ్వర్లు, ఆత్మకూరు ఇరిగేషన్ ఈఈ



ఆత్మకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు జనవనరుల శాఖకు సంబంధించి జరిగిన నష్టాలను పరిశీలించి నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఇరిగేషన్ ఈఈ ఆర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనిధులతో తూముల మరమ్మతులు చేపడతామన్నారు.

? ఎన్ని కోట్ల రూపాయలకు ప్రతిపాదనలు పంపారు.

! ఆత్మకూరు డివిజన్ పరిధిలోలో 25 పనులకు గాను రూ. 3 కోట్ల నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. అదే క్రమంలో రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు చెరువులు, తూముల అభివృద్ధికి రూ. 4.85 కోట్ల నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. ఈ నిధులతో 53 పనులు చేట్టనున్నాం.

? ఏయే మండలాలకు ఎన్ని నిధులు కేటాయించారు.

! ఆత్మకూరు మండలంలో 21 పనులకు గాను రూ. 2 కోట్లు, ఏఎస్‌పేటలో 8 పనులకు కోటి రూపాయలు, చేజర్లలో 4 పనులకు రూ. 60లక్షలు, అనంతసాగరంలో 14 పనులకు రూ. 73లక్షలు, మర్రిపాడులో 6 పనులకు రూ. 50లక్షల నిధులు కేటాయించాం. ఇప్పటికే ఆత్మకూరు సప్లయ్ ఛానల్‌కు ఏటికాలువ పూడికతీత పనులు పూర్తిచేశాం.

? ఎన్ని నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

! ఆత్మకూరు మండలంలో 8, చేజర్లలో 10, మర్రిపాడులో 18, ఏఎస్‌పేటలో 14, అనంతసాగరం మండలంలో 10 నీటి సంఘాలు ఉన్నాయి. ఈ నీటి సంఘాలకు ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నాం.

న్యూస్ బాక్స్

మండప నిర్మాణానికి విరాళం

కందుకూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత అంకమ్మ ఆలయంలో అనివేటి మండప నిర్మాణానికి మంచిరాజు వెంకట మురళీమోహన్, చంగాళ అపర్ణ దంపతులు ఆదివారం రూ.25,116లను అందజేశారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీసభ్యులు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డికి ఈ మొత్తాన్ని అందజేశారు. అలాగే కోయగుంట్ల బాలఅంకయ్య, రమణమ్మ దంపతులు రూ.5116లను ఇచ్చారు. ఈ సందర్భంగా కమిటీసభ్యులు వారికి అభినందనలు తెలిపారు.

అర్చకుడికి చేయూత

కావలి టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): యూరాలజీ సమస్యతో బాధపడుతూ సర్జరీ చేయించుకున్న సాయి దేవస్థానం అర్చకులు నాగేంద్రస్వామికి ఆదివారం కావలి బ్రాహ్మణ మహాసంఘం సభ్యులు రూ.22,000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు టీవీఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, శేషగిరిరావు, రమేష్, రవికుమార్, రాజేంద్రకుమార్, తెలికేపల్లి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అన్నదానం

కావలి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బుడమగుంట గిరిజనులకు ఆదివారం డాక్టర్ కర్నాటి రోహిత్, డాక్టర్ నాగభార్గవి దంపతులు పాప అనురాధ 2వ పుట్టిన రోజు పురస్కరించుకుని అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ కుటుంబానికి సంబంధించిన కార్యాలన్నీ పేద గిరిజనుల మధ్య జరుపుకోవడం ఆనవాయితీగా మలుచుకున్నామని తెలిపారు.

క్రీడల్లో నెల్లూరుకు ప్రత్యేక కీర్తి

● జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యతిరాజ్

నెల్లూరు(విద్య), అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి): క్రీడలకు అత్యంత ప్రాధాన్యంతో పాటు అన్ని వసరులు, వసతులు కలిగిన జిల్లాగా నెల్లూరు రాష్ట్రంలోనే ప్రత్యేక కీర్తి గడించిందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్‌కే యతిరాజ్ తెలిపారు. జిల్లాలో క్రీడారంగాభివృద్ధి, వసతులపై ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా ముచ్చటించారు.



? క్రీడాభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! రాష్ట్ర, జాతీయ క్రీడలకు నెల్లూరు వేదికగా ఉంది. ఇప్పటికే జిల్లాలో పలు క్రీడా వసతులు ఉండగా తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో మరిన్ని క్రీడా వసతులు అందుబాటులోకి రానున్నాయి. కేవీకేల పునర్నిర్మాణం, అన్ని నియోజకవర్గాల్లో స్టేడియాల ఏర్పాటు, మొగళ్లపాళెంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ప్రారంభంపై ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించారు.

? డీఎస్ఏలో ప్రత్యేక కార్యాచరణ ఏమిటి.

! డీఎస్ఏకు సంబంధించి ప్రస్తుత ఇండోర్ స్టేడియంలో కొన్ని మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. వీటికి ప్రతిపాదనలు పంపించాము. శాప్ అంగీకారం తెలిపింది. అసంపూర్తిగా ఉన్న రీజనల్ హాస్టల్ భవనాన్ని కూడా అధికారులు పరిశీలించారు. నిర్మాణం పూర్తి చేయడానికి, స్పోర్ట్స్ హాస్టల్స్‌ను తిరిగి ప్రారంభించేందుకు ప్రతిపాదనలు పంపించాము. జిమ్నాస్టిక్స్, వ్యాయామం చేసుకునే రెండు పాత ఇండోర్ల పునరుద్ధరణకు, హాకీ కోర్టుకు ఫెన్సింగ్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాము.

? మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ప్రారంభం ఎప్పుడు.

! మొగళ్లపాళెంలో 150 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిష్ఠాత్మకంగా క్రీడాగ్రామం ఏర్పాటు కాబోతోంది. ఇప్పటికే రూ.8కోట్లతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. నీటిపైప్ లైన్స్ నిర్మాణానికి రూ.11 లక్షలు విడుదల చేశారు. వారం పదిరోజుల్లో ఆ పనులు కూడా పూర్తవుతాయి. ఈ మైదానంలోనే ఖేలో ఇండియా నిధులతో సింథటిక్ ట్రాక్ నిర్మాణం, రెజ్లింగ్, బాక్సింగ్, ఫెన్సింగ్, జూడో వంటి ఇండోర్ క్రీడలకు సంబంధించిన అకాడమీల ఏర్పాటుకు విన్నవించాము. శాప్ చైర్మన్ రవినాయుడు సూచనలతో ప్రహరీ, బీటీరోడ్ల నిర్మాణం, మైదానం లెవలింగ్‌కు ప్రతిపాదనలు పంపించాము.

వైసీపీ పాలనలో గిరిజనుల బతుకులు దుర్భరం : బొబ్బేపల్లి

తోటపల్లిగూడూరు, అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి) : గత వైసీపీ పాలనలో గిరిజనుల బతుకులు దుర్భరంగా మారాయని జనసేన సర్వేపల్లి నియోజకవర్గం సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు పేర్కొన్నారు. మండలంలోని పేడూరు పంచాయతీ కొలిదిబ్బ గిరిజన కాలనీలో ఆదివారం జనసేన నాయకులు పర్యటించారు. అనంతరం సురేష్‌నాయుడు మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో సర్వేపల్లి నియోజకవర్గంలోని పేద గిరిజనులకు సొంత ఇంటి కలను కూడా నెరవేర్చలేదన్నారు. ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు, ఓటర్ కార్డులు ఇప్పించిన దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం గిరిజనుల సొంత ఇంటి కలను నెరవేరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధా, నడవల రవికుమార్, నాసిన గణేష్, ఎంపుటూరు వినయ్, కుడుముల విల్లు, సంగారు వినోద్, తిరకాల రాజా, అన్నం మహేష్, పాల్గొన్నారు.

వైభవంగా మహాసంప్రోక్షణ

● కనుల పండువగా కల్యాణం
● ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు





కల్యాణ వేదికపై శ్రీసౌభాగ్య సరస్వతీ సమేత బ్రహ్మేంద్రస్వామి, మహా సంప్రోక్షణకు హాజరైన భక్తులు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి) : నగరంలోని పప్పులవీధి గురుదత్తాత్రేయ మఠంలో నిర్మించిన సౌభాగ్య సరస్వతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం, మహా సంప్రోక్షణ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు, హోమాలు, ప్రాయశ్చిత్త హోమం, మహాపూర్ణాహుతి, కలిశోద్వాసన, కళావాహన, మహాకుంభాభిషేకాలు జరిగాయి. తిరుపతి శ్రీపీఠం పీఠాధిపతులు రమ్యానంద భారతీస్వామి స్వహస్తాలతో కుంబాభిషేకం నిర్వహించారు. కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠాధిపతులు సిద్ధేశ్వరానంద మహాభారతి నేతృత్వంలో స్వర్ణదర్శనం, వసంతోత్సవాలు, దేవతా దర్శనాలు, అన్నప్రసాద వితరణలు జరిగాయి. సాయంత్రం సౌభాగ్య సరస్వతీ ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన దేవతల అందరికీ ఏకకాలంలో నిర్వహించిన కల్యాణం భక్తులకు నేత్రానందం చేసింది. అనంతరం సిద్ధేశ్వరానంద మహాభారతి అనుగ్రహ సంభాషణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కథలు సమాజాన్ని అధ్యయనం చేసేలా ఉండాలి



పడమటి సూర్యోదయం కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి) : రచయితలు రాసే కథలు సమాజాన్ని అధ్యయం చేసేలా ఉండాలి.. కథలు చదివితే గుండెకు హత్తుకునేలా ఉండాలి.. ఈ లక్షణాలు అవ్వారు శ్రీధర్‌బాబు రచించిన పడమటి సూ ర్యోదయం కథల సంపుటిలో ఉన్నాయని పలువు రు ప్రశంసలు కురిపించారు. ఆదివారం పెన్నా రచయితల సంఘం అధ్యక్షురాలు గోవిం దరాజు సుభద్రాదేవి అధ్యక్షతన రిత్విక్ ఎన్‌క్లేవ్‌లోని శ్రీవెంకటేశ్వర విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పడమటి సూర్యోదయం కథల సంపుటి ఆవిష్కరించారు. కథలను గంగిశెట్టి శివకుమార్, తోట సులోచన, ఇంద్రగంటి మధుసూదన్, తన్నీరు శశికళ, ఎస్వీ ఎన్ నాగగాయత్రి, అన్నం శివకృష్ణలు సమీక్షించి అభినందించారు. కార్యక్రమంలో పద్యకళాపరిషత్ అధ్యక్షుడు ఎం.రామచంద్రప్రసాద్, మోపూరు నరసింహం, ఈతకోట సుబ్బారావు, బృందావన రావు మాట్లాడారు. అనంతరం రచయిత అవ్వారు శ్రీధర్‌బాబును సన్మానించారు.

ఉచిత కేన్సర్ స్ర్కీనింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

విడవలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కేన్సర్‌రహిత నియోజకవర్గంగా లక్ష్యంగా వీపీఆర్ ఫౌండేషన్ తలపెట్టిన ఉచిత కేన్సర్ స్ర్కీనింగ్ సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యవోలు సత్యంరెడ్డిలు తెలిపారు. ఆదివారం వారు విడవలూరులో విలేకరులతో మాట్లాడారు. నేటి నుంచి నవంబరు 3వరకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఈ వైద్యపరీక్షలను నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, చెముకుల శ్రీనివాసులు, కుడుముల సుబ్రమణ్యం, చలంచర్ల కామేశ్వరి, భవానమ్మ తదితరులు పాల్గొన్నారు.

3న చలో విజయవాడ

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన కొత్త వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నవంబరు 3న విజయవాడలో జరిగే వక్ఫ్ పరిరక్షణ సదస్సుకు ముస్లింలు భారీగా తరలిరావాలని ముస్లిం మత పెద్దలు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో జమాతే ఇస్లామీ హింద్ కార్యక్రమంలో ముస్లిం ప్రముఖుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న అబ్దుల్ రెహమాన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక జమాత్ అధ్యక్షులు జనాబ్ అన్వర్ బాషా, లేబర్ టీడీ అధినేత జమాలుల్లా, 42వ డివిజన్ కార్పొరేటర్ కరిముల్లా, టీడీపీ నాయకులు ఆసిఫ్ పాషా, జియావుల్ హఖ్, ఫయాజ్, దర్గా ముత్తవల్లీలు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అవకతవకలు

● గొల్లకందుకూరులో తేలిన లెక్కలు




గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

నెల్లూరురూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన అక్రమాలు సామాజిక తనిఖీల్లో బహిర్గతమవుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం మండలంలోని గొల్లకందుకూరులో నిర్వహించిన గ్రామసభలో పలు అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై ఈనెల 20వ తేదీ నుంచి 17 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీలు జరిగాయి. అందులో గుర్తించిన అక్రమాలు, అవినీతిపై గ్రామసభలు నిర్వహించగా గొల్లకందుకూరులో కూలీల లెక్కల్లో తేడాలున్నట్లు తనిఖీ బృందం బయటపెట్టింది. ఎస్సీలకు అతి తక్కువ రోజులు ఉపాధి చూపారంటూ ఆరోపణలు వెలుగుచూశాయి. తమకు పనిచూపాలని కోరినా పట్టించుకోలేదన్న విమర్శలు గుప్పుమన్నాయి. ఆర్థిక చెల్లింపుల్లోనూ ఎంబుక్ కంటే ఎక్కువగా చెల్లింపులైనట్లు తేల్చారు. మిగిలిన గ్రామాల్లో పనులకు వచ్చిన కూలీల వద్ద సంతకాలు తీసుకోకపోవడం, పనులు గుర్తింపులో ఏకపక్షంగా వ్యవహరించడం జరిగినట్లు తనిఖీ అధికారులు గుర్తించారు.

రేపు మండల స్థాయి సభ

మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 20వ తేదీ నుంచి ఉపాధి పనులపై చేపట్టిన తనిఖీల్లో గుర్తించిన అక్రమాలను బహిర్గతం చేసేందుకు మంగళవారం రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయిలో సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శైలేంద్రకుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో ఏడాది కాలం పాటు జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో ఏ మేరకు అక్రమాలు జరిగాయో ఈ సభలో స్పష్టంగా తనిఖీ బృందాలు వెల్లడించనున్నట్లు తెలుస్తోంది.

పోలీసులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



పోటీల్లో పాల్గొన్న పోలీసు ఉద్యోగులు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో పోలీసుల సవాళ్లు అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో ఉత్తమ ప్రతి భ కనబరిచిన వారిని ఎంపిక చేసి బహు మ తులు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ బీ శ్రీనివాసరెడ్డి, అడ్మిన్ ఆర్ఐ హరిబాబు, వెల్ఫేర్ ఆర్ఐ రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

కళాంజలి ఆర్ట్స్, క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి): నగరంలో కేవీఆర్ పెట్రోలు బంకు ఎదురుగా ఏర్పాటు చేసిన కళాంజలి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్ ఆదివారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చేనేతలను, హస్తకళలను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

నగరంలోని మాగుంట లేఅవుట్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదా పద్మావతి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణం ఆదివారం కనుల పండువగా జరిగింది. ఆలయ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

ఆకట్టుకుంటున్న వక్తృత్వ పోటీలు

శ్రీగణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞాన బోధ సభ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం అష్టలక్ష్మీ ఆలయంలో 4, 5, 6, 7వ తరగతి విద్యార్థులకు పురాణంలో భగవంతుని, గురురూప అవతారాలు గురించి, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు పురాణములు స్మృతుల ప్రకారం ధర్మం భక్తి, జ్ఞానం అంటే ఏమిటి? నేటి సమాజంలో వీటి ఆవశ్యకత అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి.

అనాథలకు దుప్పట్ల పంపిణీ

నగరంలోని బాలాజీనగర్ షిరిడీ సాయిదర్బార్‌లో బాబా సమాధి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున శ్రీసాయిదర్బార్ యువసేవాదళ్ ఆధ్వర్యంలో నగరంలోని పలు చోట్ల రోడ్డు పక్కన నిద్రించే అనాథలకు, రైల్వే స్టేషన్, బస్టాండ్‌లు, మందిరాలు, మసీదులు, చర్చిలు ముందు నిద్రిస్తున్న వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. దాతలకు, శ్రీసాయిదర్బార్ అధ్యక్షుడు మధుసాయి ధన్యవాదాలు తెలిపారు.

బారికేడ్ల ఏర్పాటు

మనుబోలు(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రమాదాల నివారణకు ఎస్‌ఐ శివరాకేష్ ఆదివారం బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు.

మాతా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ముత్తుకూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : శ్రీమాతా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఆదివారం ముత్తుకూరు అరుంధతీయవాడలో జరిగింది. ఈ సందర్భంగా భూమిపూజ కమిటీ సభ్యులు దర్శిగుంట చంద్రమోహన్, దర్శిగుంట శ్రీనివాసులు, దర్శిగుంట సంజీవయ్యలు మాట్లాడుతూ గతంలో టీటీడీ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి ప్రయత్నాలు చేసినా ఫలించలేదన్నారు. దీంతో తమ గ్రామంలోని యువత ముందుకు వచ్చి దాతలు, గ్రామస్థుల సహకారంతో ఆలయం నిర్మించుకునేందుకు పూనుకున్నామన్నారు. ఆలయ పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు కాకు సుకుమార్‌ను ఎంపిక చేశామని తెలిపారు.

రైతు సంక్షేమమే ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ధ్యేయం

కొడవలూరు అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ధ్యేయమని ఆ దిశగా కృషి చేస్తున్నారని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మందిపాటి ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆమె ఆదేశాలు మేరకు ఆదివారం నార్తురాజుపాలెం పంట కాలువల పూడికతీత పనులు ఎమ్మెల్యే సొంత నిధులతో చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కరకటి మల్లికార్జున, పాటూరి రమ, మందిపాటి రమణారెడ్డి, ఇరువూరి యోగానందరెడ్డి, నాసిన ప్రసాద్, బండి కిరణ్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌కి సన్మానం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్‌గా పనిచేసి బదిలీ అయిన డాక్టర్ చంద్రశేఖర్‌ను ఆదివారం నగరంలోని వాత్సల్య శరణాలయంలో నిర్వాహకులు, ఏపీజీఈఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీజీఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ డాక్టర్ చంద్రశేఖర్ ఆరోగ్యశ్రీ వైద్యసేవలు అందించడంలో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్నారన్నారు. వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు మాట్లాడుతూ వాత్సల్య చిన్నారులకు వైద్యసేవలందించడంలో ముందుండే వారన్నారు. ఈ కార్యక్రమంలో మానవసేవయే మాధవ సేవ నిర్వాహకులు అరవ పరిమళ, విశ్వనాథం, కల్పం శ్రీనివాసులు, విజయమ్మ, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పద్యం ధారణ శక్తిని పెంచుతుంది

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలుగు పద్యాలు ధారణ శక్తిని పెంపొందిస్తాయని అచార్య టి.మాలకొండయ్య తెలిపారు. ఆదివారం రాత్రి నెల్లూరు వర్ధమాన సమాజం (టౌనుహాలు)లో చేతన సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మను చరిత్ర అల్లసాని పెద్దన అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం ఆయనను చేతన సంస్థ సత్కరించింది. ఈ కార్యక్రమంలో సీవీ సుబ్రహ్మణ్యం, వై.శేషగిరీశం, ఎంఆర్.ప్రసాద్, జీ.సుభద్రాదేవి, ఎన్.బలరామయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వేమాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

మనుబోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కంపేటలో ఆదివారం గ్రామదేవత మొలకల వేమాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. వేమాలమ్మతోపాటు అంకమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకీసేవ నిర్వహించారు.

మా పొలానికి దారి చూపండి

● లేబూరు దంపతుల నిరసన



ఇందుకూరుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తన పొలానికి వెళ్లేందుకు దారి చూపాలని లేబూరు గ్రామానికి చెందిన దంపతులు షేక్ ఇస్మాయిల్, దిల్షాన్‌లు కోరారు. ఆదివారం గ్రామంలోని తన పొలం నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వారు మాట్లాడారు. ఈ సమస్యపై ఎన్నిసార్లు మండల కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదని, చివరికి తమకు చావే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. 2ఎకరాల 75సెంట్లు పొలాన్ని 30ఏళ్లుగా సాగు చేసుకుంటున్నా తమ ముందు పొలం రైతులు ఏకొల్లు రామిరెడ్డి, ఊటీ శివయ్య, శేషయ్య, పార్థయ్యలు తమ పొలానికి వెళ్లనివ్వకుండా దౌర్జన్యానికి పాల్పడి తరచూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితుడు ఆరోపించాడు. ఉన్నతాధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని కోరారు.

హైస్కూల్ వాచ్‌మన్‌పై దాడి

కోవూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో అనధికారికంగా మద్యం అమ్మవద్దని వేగూరు జడ్పీ హైస్కూల్ వాచ్‌మన్ యేనాటి వెంకటరమణయ్య అదే గ్రామానికి చెందిన పాకం ఈశ్వర్, పాకం నారాయణ, అడపా నరసింహలను అడ్డుకున్నారు. ఆదివారం ఈ ముగ్గురు యువకులు ఇనమడుగు రోడ్డు కూడలిలో కూరగాయలు కొనుక్కుని ఇంటికి వెళ్తున్న యేనాటి వెంకటరమణయ్య దాడి చేశారు. గాయపడిన ఆయన నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

న్యూస్ బాక్స్

పవిత్రోత్సవాల ప్రారంభం

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దైవ అనుజ్ఞ పూజలు, విఘ్నేశ్వరపూజ, వాస్తుశాంతి, మృత్యంగణం, రక్షాబంధనం, స్థండీల మండపం పూజ, కంద పవిత్ర సమర్పణ, విశేష హోమ ద్రవ్యాలతో హోమం, పూర్ణాహుతి, దీపారాధన, ప్రసాద వితరణలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను సహాయ కమిషనర్ జె.శ్రీనివాసరావు, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

10న కార్తీక వనభోజనాలు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బలిజభవన్‌లో నవంబరు 10న కార్తీక్ వనభోజన కార్యక్రమం ఉంటుందని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ చెప్పారు. ఆదివారం బలిజభవన్‌లో బలిజ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్తీక వనభోజనాల అంశమై కాపు సోదరులతో సమావేశంలో చర్చించామన్నారు. ఆరోజు గాయత్రి హోమం నిర్వహించడంతో పాటు పిల్లలు, పురుషులు, మహిళల జంటలకు విడివిడిగా ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, వంగవీటి రాధాకృష్ణ తదితరులు పాల్గొంటారని తెలిపారు. కాపు సోదరులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సంఘీభావం తెలపాలని కోరారు.

విద్యార్థినికి న్యాయం చేయాలి

నెల్లూరు(విద్య), అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి) : జిల్లాలోని అనంతసాగరం మండలం కొత్తపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం బాధాకరమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీహర్ష తెలిపారు. నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థినిని పాఠశాల స్థాయి నుంచే ఓ విద్యార్థి ప్రేమ పేరుతో ఇబ్బంది పెడుతూ ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ఆత్మహత్యాయత్నానికి కారకుడయ్యాడన్నారు. నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం చేయాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని పోలీసులను కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నరేంద్ర, నేతలు చరణ్, విష్ణు, జీవన్, యశ్వంత్, రంజిత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి) : పాత మున్సిపల్ కార్యాలయంలో ఉన్న ఆశ్రమంలోని వృద్ధులకు ఆదివారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ ప్రేమ్‌దీప్, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, నారాయణ డెంటల్ కళాశాల హెచ్‌వోడీ డాక్టర్ నటరాజన్ కన్నన్, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు, నంద్యాలి మాలిని, ఉప్పలపాటి రామదాసు, రిటైర్డ్ ఏఎస్ఐ మహబూబ్‌బాషా, షేక్ అయేషా, ఆశ్రమ నిర్వాహకులు సుందరం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరురూరల్, అక్టోబరు27 (ఆంధ్ర జ్యోతి): నెల్లూరు రూరల్లోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రూరల్లోని తమ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ పార్టీ మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్, ఆలూరు తిరుపాలు మాట్లాడారు. నిర్మాణంలో నెల్లూరు-తాటిపర్తి రహదారికి ఇరువైపుల గ్రావెల్ మట్టిని వేయాలన్నారు. ఈ మార్గంలో శాశ్వత పరిష్కారంగా కల్వర్టుల వద్ద తూములు ఏర్పాటు చేయాలని చెప్పారు. నవంబరు, డిసెంబరు నెలల్లో భారీ వర్షాలు వచ్చే అవకాశాలున్నందున పొట్టెపాళెం, ములుముడి కలుజుల వద్ద హైలెవల్ వంతెనలు నిర్మించాలని, నరసింహకొండను పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్నారు. రైతులు ఇస్తున్న ఉచిత విద్యుత్‌ను గత ప్రభుత్వం 9 నుంచి 7 గంటలకు కుదించిందని దానిని కూటమి ప్రభుత్వం 9 గంటలకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జానా లక్ష్మీప్రసాద్, శ్రీపతి వెంకయ్య పాల్గొన్నారు.

'టపాసుల'కు అనుమతి ఉండాలి

మనుబోలు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అధికారులు, పోలీసుల అనుమతులు ఉంటేనే దీపావళి టపాసులు వ్యాపారస్తులు విక్రయించాలని ఎస్ఐ శివరాకేష్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ టపాసుల దుకాణాలకు అనుమతులు పొందిన వారు ఇళ్లకు, ఊరికి దూరంగా ఉండే ఖాళీ స్థలాల్లో పెట్టుకోవాలన్నారు. దుకాణాలు నిర్వహించే స్థలాలను ముందుగా పోలీసులకు తెలపాలన్నారు. దుకాణాల వద్ద ఖచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే దుకాణాల అనుమతులను రద్దుచేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.
నెల్లూరు ఏసీఎం - 9985411424

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



స్వామిని చూడగానే

అన్నీ మరచిపోతా..!

- తిరుపతిలోనే నాలుగేళ్లు చదివా
- 'ఆంధ్రజ్యోతి'తో సినీ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ మాటామంతీ

- 8లో

శ్రీరామమంత్ర

యంత్ర యాత్ర

- తిరుపతిలో ప్రారంభించిన కంచి పీఠాధిపతి
- నవంబరు 17న అయోధ్యకు చేరిక

- 8లో

వాళ్లూ.. వీళ్లూ కలిసి

ఇసుక దోచేస్తున్నారు

కీలకంగా ఓ టీడీపీ నేత

రాత్రికి రాత్రే బెంగళూరుకు అక్రమ రవాణా



కొట్రమంగళం స్వర్ణముఖి నదిలో ఇసుకను తరలింపు



ఎస్‌ఆర్‌కండ్రిగలోని ఇనాం భూముల్లో 20 అడుగులు తవ్వేశారిలా..

లారీ ఇసుక రూ.1.3 లక్షలు. ఒక రాత్రికి 11 లారీలు వెళతాయి. తద్వారా రూ.14.3 లక్షలు సంపాదిస్తున్నారు. ఇంత భారీగా జరిగే ఇసుక అక్రమ రవాణాలో తెరముందు కనిపించేది వైసీపీ నేతలు. తెరవెనక సూత్రధారి ఓ టీడీపీ నాయకుడు.. ఆయనకు సహకరించే మరికొందరు.



ఇసుక అక్రమ రవాణకోసం ప్రత్యేకంగా వేసుకున్న రోడ్డు

రేణిగుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం కొట్రమంగళం పంచాయతీ నుంచి జీపాళెం పంచాయతీ వరకు సుమారు 11 కిలోమీటర్లు స్వర్ణ ముఖి నది ఉంది. వైసీపీ హయాంలో ఇక్కడ్నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగింది. కూటమి అధికారంలోకి రాగానే మండలంలోని ఓ టీడీపీ నేత కన్ను ఇసుకపై పడింది. ఇసుక అక్రమ రవాణాలో అనుభవమున్న వైసీపీ నేతలతో ఆయన జట్టుకట్టారు. స్వర్ణముఖి నదిలో, ఇనాం భూముల్లో ఇసుకను లోడి తండ్లం, కొట్రమంగళం, ఇతర గ్రామాల సమీపంలో ఉంచి.. ఒకేసారి 11 లారీల్లో పైన పట్ట కప్పి బెంగళూరుకు తరలిస్తున్నారు. మరోవైపు వైసీపీకి చెందిన ఓ నాయకుడు టీడీపీలో చేరానని చెబుతూ ఎవరికి ఇవ్వాల్సిన వాటాలు అందిస్తూ ఇసుక అక్రమ రవాణాకు తెరలేపారు. ఎక్కడైనా ఇసుక లారీలను పట్టుకుంటే టీడీపీ నేత రంగంలోకి దిగి తమ వాళ్లదేనని, వదిలేయాలంటూ ఒత్తిడి తెస్తాడు. దీనికోసం పంచాయతీల స్థాయిలోనూ కొందరు నేతలను జట్టుగా పెట్టుకుని.. వారి చేతా ఒత్తిడి తెచ్చి విడిపించే పనులు చేపడతారు. ప్రైవేటు, ఇనాం భూముల్లోనూ ఇసుక కోసం 20 నుంచి 25 అడుగుల లోతుకు తవ్వేస్తున్నారు. ఇలా వాల్టా చట్టానికి తూట్లు పొడవడంతో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ట్రాక్టర్ల నుంచీ దందా : ఇళ్లు కట్టుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ ప్రవేశపెట్టింది. ట్రాక్టరు, ఎడ్లబండిలో తరలించే ఇసుకను అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కేసులు నమోదు చేస్తామని ప్రకటించింది. దీనిని దుర్వినియోగం చేస్తూ ఇసుక మాఫియా ఒక్కో ఇసుక ట్రాక్టర్ నుంచీ నగదు వసూలు చేస్తుంది. దీనికోసం స్వర్ణముఖి నదీ తీరప్రాంతంలో డేరాలు వేసుకుని ఉంటున్నారు. మరోవైపు ఎవరైనా ఇళ్లు కట్టుకునే వారు ఇసుక ఎక్కడ తీసుకోవాలో తెలియక విక్రయదారులను సంప్రదిస్తే, డీజిల్, కూలీ, ట్రాక్టర్, నాయకులకు మామూళ్లు.. అన్నీ ఇస్తేనే పంపుతామంటున్నారు. ఇసుక డిమాండ్‌ను సృష్టించి రోజుకో రేటు చెబుతున్నారు. వీటన్నింటిపై తహసీల్దారు శ్యామ్‌ప్రసాద్‌ను వివరణ కోరగా.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీ విధి విధానాలు పూర్తిస్థాయిలో తమకు అందలేదన్నారు. కొద్దిరోజుల క్రితం ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకోగా.. తాము ఇళ్లు నిర్మిస్తున్నామని చెబుతున్నారన్నారు.



ఇది ఇసుక లారీనే. పైన పట్ట కప్పి మరీ తరలిస్తున్నారు. ఇటీవల స్వర్ణముఖి నది నుంచి ఇసుక తీసుకొస్తుండగా సాంకేతిక సమస్యతో ఆగిపోయింది. దీనిని అధికారులు పట్టుకున్నారు. ఇసుక దోపిడీకి ఇదో నిదర్శనం.

ఇస్కాన్ టెంపుల్‌ను పేల్చేస్తాం

- ఐఎస్‌ఐ ఉగ్రవాదుల పేరుతో మెయిల్స్
- ఒకేరోజు ఐదు హోటళ్లు, రెండు ఆలయాలకు బాంబు బెదిరింపు







ఇస్కాన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఇస్కాన్ టెంపుల్‌కు బాంబు బెదిరింపు వచ్చింది. ఐఎస్‌ఐ ఉగ్రవాదుల పేరిట ఈ మెయిల్ రావడంతో ఆందోళన నెలకొంది. ఇలా.. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నగరంలోని ఐదు హోటళ్లు, రెండు ఆలయాలకు మెయిల్స్ పంపారు. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో ఇస్కాన్ ఆలయాన్ని పేల్చేస్తామంటూ ఆలయంలో అతిథి గృహాలు బుక్‌చేసే ఐడీకి మెయిల్ వచ్చింది. బాంబు డిస్పోజల్ బృందాలు, డాగ్ స్క్వాడ్లు, డీఎస్పీ వెంకటనారాయణ, అలిపిరి సీఐ రాంకిషోర్, ఎస్‌ఐ లోకేష్, నాగార్జున రెడ్డి, బీడీ టీమ్ ఇన్‌చార్జి వీరయ్య, నాగయ్య, రెడ్డెప్పనాయుడు, వినోద్‌బాబు, కిషోర్ అక్కడకు చేరుకుని గంటపాటు తనిఖీలు జరిపారు. ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారణకు రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా, ఉదయం రీనెస్ట్, తాజ్, మారససరోవర్, కెన్సస్, గోవింద హైట్స్‌తో పాటు వరాహస్వామి ఆలయానికీ బాంబు బెదిరింపులు వచ్చాయి. వరాహస్వామి ఆలయం తిరుమలలో ఉంది. దీంతో వరదరాజస్వామి ఆలయం అయి ఉండొచ్చని భావిస్తున్నారు. దీంతో ఈ హోటళ్లు, ఆలయాల వద్దా తనిఖీలు జరిపారు.

ఇది ఎవరి పని? ● తిరుపతిని టార్గెట్ చేసింది ఎందుకు? - 8లో

పరదాలతో సరి



మంగళం ఆర్టీసీ డిపో ప్రహరీ కూలి ఏడాదైంది. అప్పట్నుంచి ఇలా గోనెసంచులు, పరదాలు కట్టి సరిపెట్టారు. ఇక్కడ 2013లో మినీ ఆర్టీసీ డిపో, గ్యారేజీ నిర్మించారు. కాశిరాయితో ప్రహరీ నిర్మించారు. కొండ నుంచి వచ్చే వర్షపు నీటి ప్రవాహానికి గోడ పునాదుల వరకు మట్టి కొట్టుకుపోయింది. గతేడాది భారీ వర్షానికి మెకానిక్ సెక్షన్ వెనుక వైపు గోడ కూలింది. అప్పట్లో సిబ్బంది తాత్కాలికంగా పరదాలు, గోనె సంచులు కట్టారు. రేకులు అడ్డుగా పెట్టారు. ఇలా.. ఏడాదిగా సరిపెట్టేశారు. రాత్రిపూట ఎలుకలు, పాములు వస్తున్నాయని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు.

- తిరుపతి(ఆర్టీసీ), ఆంధ్రజ్యోతి

రోడ్లపైనే పార్కింగ్

నిత్యం రద్దీగా ఉండే తిరుమల బైపాస్ రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. లీలామహల్ కూడలి నుంచి ప్రకాశం పార్కు వరకు రోడ్డుకు రెండువైపులా కార్లు, ఆటోలు, మినీ బస్సులు బారులు తీరుతున్నాయి. దీంతో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులకు ఇబ్బందిగా మారింది.

- తిరుపతి (లీలామహల్), ఆంధ్రజ్యోతి



స్వామిని చూడగానే అన్నీ మరచిపోతా..!

'ఆంధ్రజ్యోతి'తో సినీ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ మాటామంతీ

'స్వామిని ఏవేవో కోరుకోవాలని లిస్ట్ పెట్టుకుని వెళ్తా. తీరా ఆయన్ను చూడగానే అన్నీ మర్చిపోతా. ఏమీ కోరుకోను. నువ్వు ఇచ్చినవాటికి సంతోషంగా ఉన్నాను.. ఇంకా ఇస్తే ఆనందంగా తీసుకుంటా.. స్వామి ఆశీర్వాదముంటే చాలనుకుంటా. స్వామిని దర్శించుకుంటే ఒక పాజిటివ్ వైబ్రేషన్ వస్తుంది' అని సినీ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ అన్నారు. పలు తమిళ సినిమాల్లో కథానాయికగా రాణిస్తున్న ఈమె తెలుగులో 'టక్ జగదీష్'లో మరదలుగా, 'కౌసల్య కృష్ణమూర్తి'లో కూతురిగా, 'వరల్డ్ ఫేమస్ లవర్‌లో' భార్యగా, 'రిపబ్లిక్'లో ఎన్ఆర్ఐగా.. ఇలా పలు సినిమాలతో ప్రేక్షకుల్లో ముద్ర వేసుకున్నారు. తిరుమలేశుడిని దర్శించుకున్న ఆమె 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



నాలుగేళ్లు తిరుపతిలోనే చదివా

తిరుపతితో నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. నాన్న రాజేష్ హీరో, అమ్మ కొరియోగ్రాఫర్. అమ్మ, మోహన్‌బాబు గారు మంచి స్నేహితులు. దీంతో మా అన్నలతో కలిసి ఇక్కడే శ్రీవిద్యానికేతన్‌లో నాలుగో తరగతి నుంచి నాలుగేళ్ల పాటు చదువుకున్నా. సెలవులొస్తే కుటుంబ సభ్యులు, స్నేహితులతో గడిపేది తిరుమలలోనే. ఇప్పుడంటే వీఐపీ బ్రేక్ దర్శనం. చిన్నప్పుడు దర్శనానికి ఎనిమిది గంటల పాటు క్యూలైన్లలో నిలబడేదాన్ని. అన్ని గంటల పాటు వేచి స్వామిని చూడగానే అద్భుతమైన వైబ్రేషన్స్ వస్తాయి. మా అత్త శ్రీలక్ష్మితో (హాస్య నటి) మొదటిసారి వచ్చి స్వామిని దర్శించుకున్నా.

దీపం వెలిగించాకే అడుగు బయటకు

నన్ను వీఐపీ బ్రేక్ దర్శనం స్థితికి తీసుకొచ్చింది స్వామే నని నమ్ముతాను. పెద్ద భక్తురాలిని కానుగానీ షూటింగ్ సమయాల్లోనూ సమీపంలోని ఆలయాలకు వెళ్తుంటాను. దీపం వెలిగించకుండా బయటకు వెళ్లను. తిరుమల చాలా ఇష్టం. దర్శించుకున్నప్పుడల్లా రెండు మూడు కోరికలు చెప్పుకోవాలనుకుంటాను. స్వామి దగ్గరికి వెళ్లగానే ఒక ట్రాన్స్‌లో ఉండిపోతాను.

స్వామి అనుగ్రహం ఉంటేనే రాగలం

స్వామి అనుగ్రహం ఉంటేనే ఇక్కడికి రాగలమని నమ్ముతాను. చిత్తూరులో కార్యక్రమంలో పాల్గొనే క్రమంలో స్వామిని దర్శించుకోవాలనుకున్నా. హైదరాబాద్‌లో షూటింగ్ ఉండటంతో దర్శనానికి వెళ్లలేనేమో అనుకున్నా. అనుకోకుండా షూటింగ్ రద్దయింది. చిత్తూరులో కార్యక్రమానికి ముందురోజే వచ్చి స్వామిని దర్శించున్నాను.

పదేళ్లలో చూడని పాత్రలో నటిస్తున్నా

నాది తెలుగులో చివరి సినిమా 'రిపబ్లిక్'. మంచి సినిమా కోసం రెండేళ్ల పాటు వెయిట్ చేశా. తెలుగు సినిమాల కథలను జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటా. అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో నటించే అవకాశం వచ్చింది. అది చాలా మంచి పాత్ర. గత పదేళ్లలో తెలుగు సినిమాల్లో ఇలాంటి పాత్ర అనేది లేదు. చాలా ఇష్టపడి చేస్తున్నా. గోదావరి అమ్మాయి క్యారెక్టర్. ఎక్కువ భాషలు రావడంలో ఇండస్ట్రీలో కంపర్టబుల్‌గానే ఉంది.

ఈ జనరేషన్ చాలా స్మార్ట్

ఇప్పటి అమ్మాయిలు చాలా స్మార్ట్. ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో వీడియోలతో అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారు. సరిగా వినియోగించుకుంటే మంచి అవకాశాలొస్తాయి. సోషల్ మీడియా పవర్‌ఫుల్ కదా. రీల్స్ బాగా చేస్తూ మంచి భవిష్యత్తును నిర్మించుకుంటున్నారు. ఇటీవల ప్రభాస్ సినిమాలో కూడా ఓ అమ్మాయి హీరోయిన్‌గా ఇలాగే ఎంట్రీ ఇచ్చింది. పదేళ్ల ముందంటే ఓ ఫొటో పట్టుకుని అవకాశాల కోసం తిరిగేవాళ్లం. అందుకే ఈతరం వాళ్లు అదృష్టవంతులంటాను.





యంత్రానికి పూజలు చేస్తున్న శంకర విజయేంద్ర - యాత్రను ప్రారంభిస్తున్న శంకర విజయేంద్ర, జేఈవో వీరబ్రహ్మం

శ్రీరామమంత్ర యంత్ర యాత్ర ప్రారంభం

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ మంత్ర యంత్ర యాత్ర ఆదివారం తిరుపతిలో ప్రారంభమైంది. వినాయకనగర్‌లోని కంచి మఠం వద్ద కంచి పీఠాధిపతి స్వామి శంకర విజయేంద్ర ఆ యంత్రానికి పూజలు నిర్వహించి, టీటీడీ జేఈవో వీరబ్రహ్మంతో కలిసి యాత్రను ప్రారంభించారు. విజయేంద్ర మాట్లాడుతూ కంచి ఆలయంలోని శ్రీరామమంత్ర యంత్రాన్ని పోలిన యంత్రాన్ని బంగారంతో తయారు చేయించి అయోధ్య ఆలయంలో యాగపూజలో ఉంచుతామని తెలిపారు. ఇందులో భాగంగా తిరుపతి నుంచి ఈ మహామంత్ర యంత్రం ప్రత్యేక వాహనంలో బయలుదేరిందని, ఐదు రాష్ట్రాల మీదుగా 2వేల కిలోమీటర్లు ప్రయాణించి నవంబరు 17వ తేదీన అయోధ్య చేరుకుంటుందని వివరించారు. నవంబర్ 18 నుంచి 2025 జనవరి ఒకటి వరకు అయోధ్యలో లక్ష చండీ విశ్వశాంతి మహాయజ్ఞాన్ని నిర్వహిస్తామని తెలిపారు. శ్రీరాముడు జన్మించిన అయోధ్యకూ, కంచికీ పురాతన కాలం నుంచి సంబంధముందని, రాముల వారి జననం కోసం దశరథుడు కంచికి వచ్చి, వారం రోజులు అమ్మవారిని ప్రార్థించాడని తెలిపారు. ఈ నేపథ్యంలోనే అయోధ్యలో నిర్మించిన బాలరామాలయం వృద్ధిలోకి రావడానికి కంచి మఠం భక్తులు కృషి చేస్తున్నారని తెలిపారు. తిరుమల తరహాలో అయోధ్యలోనూ ధర్మం, దానం, తపస్సు వంటి హైందవ ధర్మ విధులు మరింత పటిష్ఠంగా నిర్వహించడానికి కంచి మఠం కృషి చేస్తోందన్నారు. తిరుపతి కంచి మఠం కేంద్రంలో ఆదివారం నుంచి ఆయుర్వేద చికిత్స కేంద్రం ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు విభీషణ శర్మ, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

ఇది ఎవరి పని?

- తిరుపతిని టార్గెట్ చేసింది ఎందుకు?
- వరసగా బాంబు బెదిరింపు ఈ మెయిల్స్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హోటళ్లు, రెండు ఆలయాలు, రేణిగుంట విమానాశ్రయానికి ఇటీవల వరుసగా బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే తీర్థకట్టవీధి ప్రాంతాలకు బెదిరింపులు తప్పలేదు. ఇదంతా ఎవరు చేస్తున్నారు? తిరుపతినే ఎందుకు టార్గెట్‌గా చేసుకున్నారనేది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు రేణిగుంట విమానాశ్రయానికి ఈ వారం రోజుల్లోనే మూడు సార్లు ఇదే రకం మెయిల్స్ వచ్చాయి. విమానాలనూ వదల్లేదు. ఇక, నాలుగు రోజుల నుంచీ తిరుపతిలోని హోటళ్ళకు వరుస బాంబు బెదిరింపులు తీవ్ర కలకలం రేపుతున్నాయి. దీంతో బెదిరింపు మెయిల్స్ వస్తుండడంతో పోలీసులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం కావడం.. తిరుపతిలో ఏం జరిగినా దేశవ్యాప్తంగా తెలిసే అవకాశం ఉండటంతో నగరాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. 'తమిళనాడులో టెర్రరిస్టు జాఫర్ సాదిక్‌కు జైలు శిక్ష పడటానికి ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ సహకారం అందించడం మాకు నచ్చలేదు. ఆ రాష్ట్రంతో పాటు తమిళనాడుకు దగ్గరగా ఉన్న పుణ్యక్షేత్రమైన తిరుపతిలోని పలు హోటళ్లను కూడా పేల్చేస్తాం' అని మెయిల్‌లో దుండగులు పేర్కొన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ తరహా మెయిల్స్‌పై లోతుగా, సమగ్రంగా దర్యాప్తు చేసే సంస్థలు, వ్యవస్థలు స్థానికంగా అందుబాటులో లేకపోవడం గమనార్హం. దీంతో బెదిరింపు మెయిల్స్ వచ్చినప్పుడు హడావుడిగా ఘటనా స్థలాలకు వెళ్ళడం, తనిఖీలు చేయడం వరకే పరిమితం అయ్యే పరిస్థితి ఉంది.

ఏర్పేడులో మూడు కేసులు నమోదు

రేణిగుంట విమానాశ్రయానికి వచ్చిన బాంబు బెదిరింపు మెయిల్స్‌పై ఏర్పేడు పోలీసు స్టేషన్‌లో మూడు కేసులు నమోదయ్యాయి. పోలీసులు, సీఐఎస్ఎఫ్ దళాలు .. రేణిగుంట విమానాశ్రయానికి వచ్చిన మెయిల్స్, బెంగళూరుకు వచ్చిన మెయిల్ ఆధారంగా దర్యాప్తు చేపడుతున్నట్లు సమాచారం. కోల్‌కత్తాలోని మిత్రా అనే వ్యక్తి ఇలాంటి ఫేక్ మెయిల్స్ వస్తున్నట్లు గుర్తించినట్లు తెలిసింది. అతడిని అదుపులోకి తీసుకున్న తర్వాత.. ఇక్కడి పోలీసులూ బెంగళూరు వెళ్లి మెయిల్స్‌ను క్రాస్ చెక్ చేసుకుని రెండూ ఒకే తరహాలో ఉంటే అతడిని పీటీ వారెంట్‌పై తిరుపతికి తీసుకురానున్నారు. ఈ మేరకు ఓ పోలీసు అధికారి చెప్పారు.

ప్రభుత్వ భూమికి కంచె





గతంలో చదును చేసిన ప్రభుత్వ భూమికి వేసిన కంచె

వడమాలపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం బాలినాయుడు కండ్రిగ పంచాయతీలోని బంగారెడ్డి కండ్రిగ ఎస్టీ కాలనీ సమీపంలో ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. సుమారు నాలుగు ఎకరాలను చదును చేసి ఏకంగా కంచె వేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 100 ఎకరాలకు పైగా గుట్ట పోరంబోకు భూములను చదును చేయడాన్ని ఎస్టీ కాలనీవాసులు అడ్డుకున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ఫిబ్రవరి 8న 'గుట్ట పోరంబోకును ఆక్రమిస్తున్నారు' అంటూ కథనం ప్రచురితమైంది. అప్పట్లో స్పందించిన రెవెన్యూ అధికారులు ఆక్రమణలను అడ్డుకుని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డు పెట్టారు. ప్రస్తుతం ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. నాలుగు ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి కంచె వేశారు. షెడ్డూ నిర్మించారు. దీనిపై స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే భానుప్రకాష్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఆక్రమణను తొలగించాలని ఎమ్మెల్యే తహసీల్దార్‌కు సూచించారు. రోజులు గడుస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని ఆక్రమణదారులు ఆ భూమిలో మొక్కలు పెంచడానికి సమాయత్తమవుతున్నారు.



కిక్కిరిసిన ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 27వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,298మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,690మంది దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,148మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 895, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 243మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 219మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 49మంది పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 14,938 అమ్ముడైనట్లు అధికారులు తెలిపారు.

బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశాలకు
దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి విద్య, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కిట్టూర్ రాణి చెన్నమ్మ రెసిడెన్షియల్ సైనిక్ స్కూల్ ఫర్ గర్ల్స్ సైనిక్ స్కూల్లో ఆరవ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 2న జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష జరుగనుందని వివరించారు. 2013 జూన్ 1 నుంచి 2015 మే 31 మధ్యకాలంలో జన్మించిన వారు అర్హులని తెలిపారు. మేథమేటిక్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, ప్రొఫిషియెన్సీ టెస్ట్, జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటీ అంశాలపై మొత్తం 300 మార్కులకు పరీక్ష ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999లలో సంప్రదించాలని కోరారు.

కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలకు అంకురార్పణ



చంద్రగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. సోమవారం నుంచి బుధవారం వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆలయంలో ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. రాత్రి మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ నిర్వహించారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగిన దోషాల నివారణకు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. సోమవారం పవిత్ర ప్రతిష్ఠ, మంగళవారం మూలవర్లకు, ఉత్సవర్లకు, విమాన ప్రాకారానికి, ధ్వజస్తంభానికి, ఆంజనేయస్వామి వారికి పవిత్ర సమర్పణ, బుధవారం పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. ఈమూడు రోజులు ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆర్జిత కల్యాణోత్సవ సేవ రద్దు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వీఆర్ వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, పార్థసారథి, నారాయణాచార్యులు, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, ధనశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలి

- సైన్స్‌సెంటర్‌లో చెకుముకి టాలెంట్ టెస్ట్

తిరుపతి విద్య, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలని, మూఢ నమ్మకాలను వ్యతిరేకించాలని తిరుపతి ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, సైన్స్ సెంటర్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రా విద్యార్థులకు పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి-2024 టాలెంట్ టెస్ట్ స్థానిక రీజనల్ సైన్స్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. మండల స్థాయిలో విజేతలైన 60 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 180 మంది విద్యార్థులు ఈ జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యారు. బాలాజీ, శ్రీనివాస్ నెహ్రా మాట్లాడుతూ దేశాభివృద్ధికి శాస్త్రీయ దృక్పథం అలవరుచుకోవాలన్నారు. శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న జనవిజ్ఞాన వేదికను అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో శ్రీహరికోట స్పేస్ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలల్లో గూడూరు జీవీఎస్ శంకరయ్య మెమోరియల్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరు వచ్చేనెల 9, 10 తేదీల్లో విశాఖపట్నంలో జరుగనున్న రాష్ట్రస్థాయి ప్రతిభా పరీక్షకు హాజరుకానున్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప, నాయకులు చెంగయ్య, రఫీ, లక్ష్మీనారాయణ, మణికంఠ, ఫిజికల్ సైన్స్ ఫోరం మేగనాథ్, రోటరీ క్లబ్ రవికుమార్, తిరుపతి బాలోత్సవం దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షలో విజేతలు



అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


మృతి చెందిన విజయసాగర్

నాయుడుపేట టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - స్వర్ణముఖినది సమీపంలో అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. పట్టణానికి చెందిన విజయసాగర్ (34) టైల్స్ నిర్మాణ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం స్వర్ణముఖినది వద్ద మృతి చెంది ఉండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆయాలకు జీతాలు పెంచండి

వెంకటగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలకు జీతాలు పెంచాలని సీఐటీయూ నాయకుడు వండ్డిపల్లి చెంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాజమ్మ, నిర్మల, సుశీల తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో కార్డెన్ సెర్చ్

12 బైకులు, 4 ఆటోల స్వాధీనం

వెంకటగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలోని జగనన్న కాలనీలోని టిడ్కో ఇళ్లల్లో పోలీసులు ఆదివారం తెల్లవారుజాన కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తగిన పత్రాలు లేని 12 బైకులు, 4 ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రమణ తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని సూచించారు.

వేమిరెడ్డి నియామకం హర్షణీయం

నాయుడుపేట టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విదేశాంగశాఖ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నియమితులు కావడం పట్ల టీడీపీ నేత కట్టా రమణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి వేమిరెడ్డికి మాత్రమే ఈ అవకాశం లభించడం సంతోషదగ్గ విషయమన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా నివేదించారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్య సాయిబాబా ఆలయంలో సత్య సాయిసేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయిబాబాకు పూజలు, భజనలు నిర్వహిం చారు. కార్యక్రమంలో వెంకట సుబ్బయ్య, తిరుపాలయ్య, సురేష్‌బాబు, ఆనంద్, మల్లికార్జున, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

పల్లె రోడ్లు ఇలా... ప్రయాణమెలా?


అడుగడుగునా గుంతలతో బురదమయంగా ఉన్న కొత్తపల్లిరోడ్డు

దక్కిలి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం గ్రామీణ రోడ్ల గురించి పట్టించుకోకపోవడంతో నేడవి గుంతమయంగా మారి ప్రజలకు నరకం చూపుతున్నాయి. మండలంలోని వెల్లికల్లు - కొత్తపల్లి, డి.వడ్డిపల్లి - కలుజుగుంట, వెంబులూరు - డి.వడ్డిపల్లి, బ్రాహ్మణపల్లి - పాతనాలపాడు హరుందతీవాడ, కేబీపల్లి - దందవోలు రోడ్డు, దగ్గవోలు - రేగడపల్లి, ఆల్తూరుపాడు - అత్తల పసిద్ధవరం గ్రామాల రహదారులు దుస్థితికి చేరాయి. అడు గడుగునా గుంతలుపడి చినుకు పడితే అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితికి చేరుకున్నాయి. అత్తలసిద్దవరం, కొత్తపల్లి గ్రామాలకు ఆటోలు కూడా ప్రయాణించలేకపోవడంతో మండల కేంద్రానికి చేరుకోవాలంటే గ్రామస్తులకు కాలినడకే శరణ్యంగా మారింది. గ్రామాల్లో ఎవరైనా అనారోగ్యం బారిన పడితే 108 వాహనం కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో నైనా తమ గ్రామాల రోడ్లను బాగు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలి: పాశం


ఆలయం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకుని ప్రశాంత జీవితం గడపాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక అలఘునాథస్వామి ఆలయంలో వాహనశాల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలఘునాథస్వామిగుడి ఎంతో ప్రాచీనమైనదన్నారు. ఈ ఆలయంలో శిథిలావస్థకు చేరుకున్న వాహనశాలను తొలగించి దాతల సాయంతో నూతన భవన నిర్మాణం చేపడుతున్నారన్నారు. ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. త్వరలోనే పట్టణంలోని ప్రసిద్ధ ఆలయాలకు కమిటీలను నియమించి ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జనార్దన్‌రెడ్డి, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, మునిగిరీష్, బత్తిన సుధాకర్, రవీంద్రరెడ్డి, రమేష్, ఓంప్రకాష్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జిల పాలన ఎన్నాళ్లు?

ఏపీఎం లేకపోవడంతో సీసీల ఇష్టారాజ్యం


వెలుగు కార్యాలయం - ఖాళీగా ఉన్న ఏపీఎం కుర్చీ

బాలాయపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) మండలంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం లేకపోవడంతో గత రెండేళ్లుగా ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. పక్క మండలాలకు చెందిన ఏపీఎంలను ఇన్‌చార్జిలుగా నియమించడంతో వారు బాలాయపల్లి కార్యాలయానికి రాకుండా స్థానికంగా పనిచేస్తున్న సీసీలకు బాధ్యతలు అప్పజెప్పి పనులు చక్కబెట్టడం పరిపాటిగా మారింది. దీంతో మండలంలోని పొదుపు సంఘాల సభ్యులు తమ సమస్యలు చెప్పుకునేందుకు అవస్థలు పడుతున్నారు. ఏపీఎం లేకపోవడంతో సీసీల ఇష్టారాజ్యంగా మారింది. ప్రతిరోజూ కార్యాలయానికి వచ్చామా.. వెళ్లామా.. అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో ఏపీఎంను నియమించాలని పొదుపు సంఘాల సభ్యులు కోరుతున్నారు.

కోటలో ఉచిత కంటి వైద్య శిబిరం


రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కోట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోటలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం పెళ్లకూరుకు చెందిన చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో తిరుపతిలోని వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ కంటివైద్య నిపుణులు డాక్టర్ భావన, డాక్టర్ రచన 180మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 100 మందికి ఉచితంగా మందులు, 60 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. అదే విధంగా 20 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ఏవో గల్లా కృష్ణ, అరవింద్ నేత్రాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అండమాన్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం


సమావేశంలో టీడీపీ నాయకులు

దక్కిలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అండమాన్ నికోబార్ దీవుల్లో 60 వేల సభ్యత్వాల నమోదు లక్ష్యంగా పెట్టుకొన్నట్లు టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు తెలిపారు. అండమాన్ నీకోబార్ దీవుల పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి అయిన ఆయన ఆదివారం ఫోన్‌లో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. అండమాన్ నికోబార్ దీవుల టీడీపీ అధ్యక్షుడు మాణిక్యాలరావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రారంభించడం జరిగిందన్నారు. ఆన్‌లైన్‌లో సాంకేతిక ఇబ్బందుల కారణంగా సభ్యత్వ నమోదు ఆలస్యం అవుతోందన్నారు. త్వరలో ఇబ్బందులను అధిగమించి సభ్యత్వ నమోదులో లక్ష్యాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ అప్పలనాయుడుతో పాటు అండమాన్ నికోబార్ దీవులకు చెందిన టీడీపీ నేతలు పాల్గొన్నట్లు వివరించారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ


గూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతిసేవాసంస్థ కార్యాలయంలో మల్లికార్జున్‌రెడ్డి దాతృత్వంతో ఆదివారం పేదలకు నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, మురళి, ప్రభాకర్, దయాకర్, రాము, నాగరాజు, రామకృష్ణా తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీహాలులో సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో రవీంద్రరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, దశరధరామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ప్రజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెకుముఖి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రసంశాపత్రాలతో విద్యార్థులు

నాయుడుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలో జరిగిన చెకుముఖి టాలెంట్ టెస్టులో నాయుడుపేట విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. స్థానిక జడ్పీ బాలుర పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థి ఎ.సాయిరాజ్, 9వ తరగతి విద్యార్థి ఎ.ప్రదీప్‌రాజ్, 8వ తరగతి విద్యార్థి ఎం.జాయి ప్రీతీష్ జిల్లాస్థాయిలో ద్వితీయస్థానం సాధించారు. విద్యార్థులకు ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ ప్రసంశా పత్రాలను అందజేశారు. వీరికి శిక్షణ ఇచ్చిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు మధుసూదన్‌ను అభినందించారు.

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శిగా రాజారెడ్డి



పెళ్లకూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు గ్రామానికి చెందిన పాదర్తి రాజారెడ్డి భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర రాజారెడి ని ఏకగ్రీవంగా నియమించారు. ఆయన నియమాకం పట్ల భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కోశాధికారి తుమ్మతోటి ముని హర్షం వ్యక్తం చేశారు.

స్థలం విషయంలో ఘర్షణ

నలుగురికి గాయాలు

తడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థలం విషయంలో అన్నదమ్ముల కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని కారూరు గ్రామానికి చెందిన అంబాకం చంద్రన్, అంబాకం బాబు అన్నదమ్ములు. ఇటీవల వారి తండ్రి మరణించడంతో ఆయనకు సంబంధించిన స్థలం విషయంలో అన్నదమ్ముల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆ స్థలం మొత్తాన్ని ఆక్రమించుకునే ఉద్దేశంతో ఆదివారం బాబు ప్రహరీ నిర్మించడానికి ప్రయత్నించడంతో చంద్రన్ అడ్డుకున్నాడు. దీంతో బాబు కుటుంబసభ్యులు గడ్డపార, కర్రలతో చంద్రన్‌తో పాటు అతని కుటుంబసభ్యులపై దాడి చేశారు. ఈ దాడిలో చంద్రన్, అతని భార్య, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులకు సమాచారం అందడంతో గ్రామానికి చేరుకొని క్షతగాత్రులను తడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం



సూళ్లూరుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పార్కింగ్ చేసివున్న ఎలక్ట్రిక్ బైక్‌లో మంటలు చెలరేగి దగ్ధమైన ఘటన ఆదివారం సూళ్లూరుపేటలో చోటు చేసుకొంది. పట్టణానికి చెందిన దేవత బాలాజి తన ఎలక్ట్రిక్ బైక్‌ను మున్సిపాలిటీ కార్యాలయం వెనుక ఉన్న బాలాంజనేయస్వామి ఆలయం వద్ద పార్కింగ్ చేసి ఆలయంలో పూజకు వెళ్లాడు. ఒక్కసారిగా బైక్‌లో మంటలు రావడంతో అక్కడున్న వారందరూ భయాందళనకు గురయ్యారు. మంటలు బాగా వ్యాపించి బైక్ పూర్తిగా దగ్ధమైంది.

చెంగాళమ్మ ఆలయంలో భక్తుల సందడి


చెంగాళమ్మ ఆలయం వద్ద భక్తుల పూజలు

సూళ్లూరుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకొనే వారు, దర్శనానికి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణమంతా రద్దీ నెలకొంది. స్థానికులే కాకుండా తమిళనాడు నుంచి వచ్చి భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు


చెందోడులో సభ్యత్వ నమోదు చేస్తున్న విజయభాస్కర్‌రెడ్డి

కోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడు పంచాయతీలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగింది. ఆ పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వడ్డిపాళెం, దళితవాడ, నీలగిరి సంఘం కాలనీల్లో పర్యటించి టీడీపీ సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలు, బీమా సౌకర్యాలను వివరించారు. 100 మందికి ఆన్‌లైన్ సభ్యత్వం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయ, కృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దీపావళికి ముందే ధరల మోతలా: వైసీపీ

కోట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరిస్తూ నిత్యావసర వస్తువుల ధరలను భారీగా పెంచి పేదల నడ్డి విరుస్తోందని వైసీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి విమర్శించారు. విద్యానగర్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం దీపావళి పండుగకు ముందుగానే వంట నూనె ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపిందన్నారు.